సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 ఆగస్టు 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల



## ప్రతి ఇంటికీ కమలం చేరాలి!



# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:18 | 10 ఆగస్టు 2017


ఈ సంచికలో...


- నకిలీ గోరక్షక్ తోకలు పట్టుకుని దుష్టచతుష్టయం వైతరిణి దాటలేదు! ... 03
- నరకకూపంగా హైదరాబాద్ మురికివాడలు ... 04
- పేదల గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి! ... 05
- పౌరులే జాతి నిర్మాతలు ... 06
- పతి ఇంటికీ కమలం చేరాలి! ... 07
- అధ్యక్షోపన్యాసం ... 08
- టీఆర్ఎస్‌తో నిత్య యుద్ధమే ... 11
- కేసీఆర్ హామీలు నీటి మీది రాతలు ... 12
- టీఆర్ఎస్‌ది రైతు వ్యతిరేక విధానం ... 14
- అజేయంగా రాజస్థాన్ బిజెపి ... 16
- బీహార్: కుహనా సెక్యులర్ రాజకీయాల పరాజయం ... 17
- ఉత్సాహంగా జిల్లా కార్యవర్గ సమావేశాలు ... 18
- అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలి! ... 20
- స్ఫూర్తిదాయకంగా కుషాభావ్ ఠాక్రే జీవితం ... 21
- లక్ష్యాలలో సామ్యం, మార్గాలలో భిన్నత్వం ... 22
- మూక హింసపై తప్పుడు ప్రచారాలు ... 24
- పథకాల అమలు ముఖ్యం ... 25
- సంకల్పదినంగా ఆగస్టు 15 ... 26
- కాంగ్రెస్‌ను వెంటాడుతున్న బోఫోర్స్ పీడకల ... 27
- పాక్‌లో పరిణామాలు - భారత్‌పై ప్రభావం ... 28
- కశ్మీర్ లోయలో వేర్పాటువాద ఉగ్రవాదుల తిరోగమనం ... 29
- సంచలనం కోసమే డ్రగ్స్ విచారణా..? ... 30
- నేరెళ్ల బాధితుల పక్షాన బిజెపి ... 31
- హింస మీదే కమ్మీల నమ్మకం ... 32
- గల్ఫ్‌లో భారత కార్మికులను ఆదుకుంటాం ... 33
- ఈశాన్యానికి భారీ సాయం ... 34



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com

Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.


## సంపాదకీయం

# నకిలీ గోరక్షక్ తోకలు పట్టుకుని దుష్టచతుష్టయం వైతరిణి దాటలేదు!


జాతీయ సమైక్యతను విచ్ఛిన్నం చేయడానికి జాతి వ్యతిరేక దుష్టచతుష్టయం నూతనంగా జపిస్తున్న "గోరక్షక్" మంత్రం కూడా విఫలం కాక తప్పదు. జాతీయ శక్తులు బలపడితే తమ ఆటలు సాగవన్న భయంతో విదేశీ పోషిత మత ప్రచారకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ కుట్రలను కొనసాగిస్తున్న వైనాన్ని దేశప్రజలు ఏనాడో గమనించారు. మధ్యప్రదేశ్‌లో నన్స్‌పై అత్యాచారం జరిగిందని, చర్చిపై దాడి జరిగిందని, గుంటూరు మసీదులో బాంబు పేలిందని వచ్చిన వార్తలన్నీ అసత్యాలని, దురుద్దేశ్యపూరిత కుట్రల్లో భాగంగా తప్పడు కేసులు నమోదు చేయించి, మీడియాలో స్థానం కల్పించారని కాలాంతరంలో రుజువైన సంగతిని ప్రజలు మర్చిపోలేదు. మత మార్పిడులే ప్రధాన లక్ష్యమైన ఈ దుష్టశక్తులు స్థానిక రాజకీయ శక్తుల సహాయ సహకారాలతో అర్థసత్యాలను, అసత్యాలను సైతం కొంతకాలం వార్తలుగా ప్రచారం కల్పించగలిగాయి. ఈ దుష్టశక్తులకు కావలసింది కూడా అంతవరకే. ఇలాంటి అసత్యాలకు రాజకీయవాదుల ప్రకటనలతో, పత్రికా ప్రచురుణలతో సత్యమనే భ్రమ కల్పించి, ఈ సమాచారం అంతటినీ పోగేసి తమ లాబీ ద్వారా అమెరికన్ కాంగ్రెస్ ముందు పెట్టించి, భారత్‌లో మతసహిష్ణుత కరవైందని మొసలి కన్నీరు కార్పించడం, తద్వారా విచ్చలవిడిగా తమ మత మార్పిడి కార్యక్రమాలు కొనసాగించుకోవడమే వారి అసలు లక్ష్యం. కాంగ్రెస్, కమ్యూనిస్టు, ఇతర కుహనా లౌకికవాద పార్టీలు కూడా తమ రాజకీయ లబ్ధి కోసం జాతి వ్యతిరేక శక్తుల కుట్రలో పాలుపంచుకోవడానికి అలవాటు పడ్డాయి.

జాతీయ శక్తుల (ఐకాన్) సంకేతంగా బలపడుతున్న అలనాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠను దెబ్బతీయడం కోసం 'మోదీకి అమెరికా వీసా నిరాకరించింది' అన్న తప్పడు వార్తను ప్రచారంలోకి తెచ్చారు. దానికి లభించినంత ప్రచారం 'మోదీ అసలు అమెరికా వీసా కోసం దరఖాస్తు చేయనే లేదు' అన్న ప్రకటనకు లభించనే లేదు.

దుష్ట శక్తుల సకల యత్నాలను భగ్నం చేసి జాతీయ శక్తుల ప్రతినిధిగా మోది ప్రధాని కావడంతో కాంగ్రెస్, కమ్యూనిస్టు, కుహనా లౌకికవాద పార్టీలు, విదేశీపోషిత మతవాదులు అనే దుష్ట చతుష్టయం అసహనం పాలైంది. ఎంపిక చేసుకున్న కొందరితో అవార్డు వాపసీ నిర్వహించి, తమ అసహనాన్ని ప్రజల అసహనంగా ప్రంపంచాన్ని నమ్మించాలని ప్రయత్నించి విఫలమైంది. దిక్కుతోచక నిరాశతో 'గోరక్షక్' మంత్ర జపం ఆరంభించారు. వ్యక్తిగత కక్షలు, కుటుంబ కలహాలు, ఆర్థిక వివాదాల కారణంగా జరిగిన దాడులు, హత్యలను సైతం 'గోరక్షక్' ఖాతాలో వేసి మోదీ అధికారం లోకి వచ్చాకే ఇలాంటి దురాగతాలనే ఆరోపణలకు కూడా ప్రజల నుండి స్పందన లభించలేదు. గోరక్షణ పేరిట చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించరాదని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ప్రకటించాక కూడా విపక్షాల వైఖరి మారలేదు. ఆశ చావని కాగ్రెస్ పార్లమెంటులో గోరక్షక్ అంశాన్ని ప్రస్తావించగానే ఎప్పుడెప్పుడు ఎవరెవరి ఏలుబడిలో ఇలాంటి దుస్సంఘటనలు ఎన్ని జరిగాయో గణాంకాలతో సహా గత పది సంవత్సరాల చరిత్రను హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు ఏకరువు పెట్టడం ప్రారంభించగానే విపక్షాలు తోక ముడిచాయి. రాష్ట్రాల పరిధిలోని శాంతిభద్రతలకు చెందిన ఈ అంశంపై కేంద్రాన్ని తప్పు పట్టరాదనే ఇంగితం లోపించిన విపక్షాల వైఖరికి దేశం విస్తుపోతున్నది.

యమలోకంలో పాపుల పాలిటి వైతరిణిలా దుష్టచతుష్టయానికి దాపురించిన రాజకీయ సంకటాన్ని దాటేందుకు ఆరంభించిన గోరక్షక్ మంత్ర జపం ఫలించదు. తూ,తూ మంత్రాల గోదానాలతో పాపులు వైతరిణిని దాటలేనట్లే నకిలీ 'గోరక్షక్' తోకలు పట్టుకుని దుష్టచతుష్టయం రాజకీయ వైతరిణి దాటలేదు!

వర్తమానం



# నరకకూపంగా హైదరాబాద్ మురికివాడలు

హైదరాబాద్ మురికివాడల నరకకూపంగా మారిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు పేర్కొన్నారు. హైదరాబాద్ లో మురికివాడల స్థితిగతులపై రూపొందించిన అధ్యయన నివేదిక "ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్ స్లమ్స్: ఏ రిపోర్ట్" ను ఇరువురు నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మన్ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాలే కేంద్రంగా అభివృద్ధి జరుగుతోందని, గ్రామాలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. చేతి వృత్తులను బహుళ జాతి కంపెనీలు కబళించాయని, ఫలితంగా పల్లెలు నిర్జీవంగా మారుతున్నాయని వాపోయారు. గ్రామీణ ప్రజలు వలస కూలీలుగా మారుతున్నారని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు మురికివాడలను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో 1962లో 106 మురికి వాడలు ఉండగా, నేడు అవి 1476కు పెరిగాయని, దాదాపు 20 లక్షల మంది మురికివాడల్లో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా రక్షిత తాగునీరు, నివాస సమస్యలు, మురుగుదొడ్ల సమస్యలతో సతమతం అవుతున్నారని వాపోయారు. వారికి సరైన రవాణా సౌకర్యం, మంచి వైద్యం అందుబాటులో లేదని చెప్పారు. విద్య, వైద్యం, తాగునీరు, మురుగునీరు, వాననీటి వ్యవస్థల అభివృద్ధికి వెచ్చిస్తున్న డబ్బులు కాంట్రాక్టర్ల జేబుల్లోకే వెళ్తున్నాయని వాపోయారు. గత ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే హైదరాబాద్ మురికికూపంగా మారిందని, ప్రస్తుత టిఆర్ఎస్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తోందే తప్ప అక్కడ నివసిస్తున్న ప్రజల జీవన స్థితిగతులను పెంచేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని పేర్కొన్నారు. పేదలను విస్మరించి బంగారు తెలంగాణ ఎలా సాధిస్తారని లక్ష్మన్ ప్రశ్నించారు.

బస్తీల్లో ప్రజల స్థితిగతులను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని పి.మురళీధర్ రావు విమర్శించారు. నగరంలో చాలావరకు పేదలు బస్తీల్లోనే నివసిస్తున్నారని, వారిని ప్రభుత్వం చిన్నచూపు చూడడం వల్లే సమస్యలు ఉత్పన్నమవతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల తర్వాత కూడా గ్రామీణ ప్రజలు బతుకు దెరువు కోసం పట్టణాల వైపు పరుగులు తీస్తున్నారని, గ్రామాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే... పట్టణాలకు వలసలు తగ్గుతాయని తెలిపారు. బస్తీల్లో ఎస్సీలు 31 శాతం, బీసీలు 50 శాతం, ఎస్టీలు 10 శాతం ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. బస్తీల్లో నివసించే 62 శాతం వలస కూలీల కుటుంబాల్లో కుటుంబానికి ఒకరు మాత్రమే ఆదాయం కలిగి ఉన్నారని తెలిపారు. ఓయూ ప్రొఫెసర్ వి.జగదీశ్వరరావు, జెఎన్‌యు రీసెర్చ్ స్కాలర్ డా॥ ఎస్.లింగమూర్తి, ఓయూ రీసెర్చ్ స్కాలర్ డా॥ సోలంకి శ్రీనివాస్ ఈ అధ్యయన నివేదికను రూపొందించారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



ఆగస్టు 2న మహబూబ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఆశతో ఇండ్లిచ్చి గూడు కోల్పోయిన దళితులకు వెంటనే ఇండ్లు ఇవ్వాలని కోరుతూ బిజెపి నేతలు స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డితో పాటు రాజేందర్ రెడ్డి, నాగరాజు, నారాయణ, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనం చేస్తున్నది పేదరికంపై పోరాటం. వారి లోపల దాగున్న ప్రతిభను జాగృతంచేసి విజయం సాధిద్దాం.

# పేదల గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి!

తెలంగాణవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న 'వాంబే', రాజీవ్ స్వగృహ, ఇందిరా ఆవాస్ యోజన కింద అసంపూర్తిగా నిర్మించిన ఇండ్లను పూర్తిచేయడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు శ్రద్ధ కనబర్చడం లేదో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి మూడు సంవత్సరాలు పూర్తయినా, కనీసం 3 వేల ఇండ్లు కూడా కట్టలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. డా॥ కె.లక్ష్మన్ నేతృత్వంలో ఆగస్టు 3న బిజెపి నాయకుల బృందం మేడ్చెల్ జిల్లాలోని గాజుల రామారం, కౌకూర్, జవహర్‌నగర్, పోచారం గ్రామాలలో విస్తృతంగా పర్యటించి అసంపూర్తిగా నిర్మించిన స్వగృహ, వాంబే, ఇందిరమ్మ ప్రాజెక్టుల ఇండ్లను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. ఆయా పథకాల లబ్ధిదారులు లక్ష్మన్‌తో తమ గోడు వెల్లబోసుకున్నారు. ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.



గాజులరామారంలో 36 ఎకరాలలో పద్నాలుగు అంతస్తులలో అపార్ట్‌మెంట్లు నిర్మించారని, అయితే అందులో 2,029 ప్లాట్లు నిరుపయోగంగా ఉన్నాయని లక్ష్మన్ అన్నారు. అటు అల్వాల్ కౌకూర్‌లో 800 వాంబే ఇండ్లు పూర్తయితే 40 మందికి మాత్రమే కేటాయించారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారు దగ్గర రూ.60 వేలు తీసుకొని మొండిచెయ్యి చూపిస్తున్నారని మండిపడ్డారు. అన్నోజిగూడ పోచారంలో 30 ఎకరాలలో 6 వేల ఇండ్లను అసంపూర్తిగా నిర్మించారని డా॥ లక్ష్మన్ వివరించారు.



2007లో ప్రారంభమైన ఈ ఇండ్ల నిర్మాణానికి రూ.22 వేల కోట్లు ఖర్చుచేశారని, డ్రైనేజీ, మంచినీరు, కరెంట్‌లాంటి కనీస వసతులు కల్పించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. వారిని పట్టించుకునే వారేలేరని, రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించి తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతకు, పనితీరుకు ఇక్కడి పరిస్థితులు అద్దం పడుతున్నాయని తెలిపారు.

కొంతమొత్తం డబ్బు ఖర్చుచేస్తే సుమారు 20వేల మందికి గృహ సౌకర్యం లభిస్తుందని సూచించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమై ప్రజలు నష్టపోతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సగం కట్టిన కట్టిన ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించడానికే 10 సంవత్సరాలు కావస్తుందని, ఈ లెక్కన డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఊహించుకోవచ్చని ఎద్దేవా చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, సీఐడీ దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం సంవత్సరాలు గడుస్తున్నా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డా॥లక్ష్మన్ ప్రశ్నించారు. ఈ గ్రామాలలో ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. అందుకు తగిన నిధులు యుద్ధ ప్రాతిపదికన కేటాయించాలని, పేదల ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడిన వారిపై సత్వర క్రిమినల్ చర్యలు చేపట్టాలని డా॥ లక్ష్మన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే బిజెపి పెద్దఎత్తున ప్రజా ఆందోళన చేపడుతుందని, ప్రభుత్వమే దానికి బాధ్యత వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ పర్యటనలో డా॥ లక్ష్మన్ వెంట బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ ఎస్.మల్లారెడ్డి, పి.మోహన్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ఎన్.బిక్కునాథ్ నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ పి.విక్రం రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**

# పౌరులే జాతి నిర్మాతలు

సమ సమాజ స్థాపన కోసం అణగారిన వర్గాలకు అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. జూలై 25న పార్లమెంటు సెంట్రల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో దేశ 14వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా ప్రసంగించారు. ఆర్థిక దిగ్గజంగా, నైతికతకు ప్రతిరూపంగా మన దేశాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు గీటురాళ్లను ఎన్నడూ విడదీయలేమనీ, అవి ఎప్పటికీ ఒకదానితో ఒకటి అనుసంధానమయ్యే ఉండాలని చెప్పారు. ప్రాచీన విలువల్ని నిలబెట్టుకుంటూనే నాలుగోతరం పారిశ్రామిక విప్లవానికి తగ్గట్టుగా మనం ఎదగాలని ఆకాంక్షించారు. సంప్రదాయాన్ని-సాంకేతికతను, వివేకాన్ని-విజ్ఞానాన్ని జోడించాలని చెప్పారు.

'భారతదేశ విజయానికి మూలసూత్రం మన భిన్నత్వంలోనే ఉంది. ఆ భిన్నత్వమే మనల్ని అత్యంత ప్రత్యేకంగా నిలిపింది. మనమంతా వేరువేరుగా ఉంటాం. కానీ ఒకేలా ఉంటాం. కలిసి ఉంటాం. రాష్ట్రాలు, ప్రాంతాలు, మతాలు, భాషలు, సంస్కృతులు, జీవన శైలులు, ఇంకా ఎన్నెన్నో... వీటన్నింటి సంగమమే భారతదేశం. ఒక జాతిగా భారతదేశం ఎంతో సాధించింది. ఇంకా ఎంతో సాధించడానికి, మరింత మెరుగుపడడానికి, వేగం పుంజుకునేందుకు అవిశ్రాంతంగా పాటుపడదాం...' అని భారత నూతన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. 'వసుధైక కుటుంబమనే భావనను విశ్వసించే దేశం మనది. చిట్టచివరి గ్రామంలో చిట్టచివరి ఇంట్లో ఉన్న అణగారిన కుటుంబంలో ఆఖరి ఆడపిల్ల వరకు అవకాశాలు లభించేలా చేయడంపై మన దేశం దృష్టి సారించాలి. దీంతోపాటు సత్వరం న్యాయాన్ని అందించే వ్యవస్థ అందరికీ అందుబాటులోకి రావాలి. బుద్ధుడు నడయాడిన ఈ నేల... శాంతి, సామరస్యత, జీవావరణ సమతౌల్య అన్వేషణలో ప్రపంచానికి మార్గదర్శిగా నిలవడం సముచితం. మహాత్మా గాంధీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కలలు కన్న రీతిలో దృఢమైన, అధిక వృద్ధితో కూడిన ఆర్థిక రంగాన్ని.. విద్యావంతమైన,



నైతికతతో కూడిన భాగస్వామ్య సమ సమాజాన్ని మనం తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సూత్రాలన్నీ మన మానవత్వ వివేచనలో అంగరాగాలు. మనం కలలు కన్న భారత దేశమిది. సమానావకాశాలు కల్పించే నేల ఇది. 21వ శతాబ్దపు దేశమిది' అని కోవింద్ చెప్పారు.

ఇంటా బయటా మహిళలు పోషిస్తున్న పాత్ర గురించి రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇళ్లలో, కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే తమ పిల్లల్ని ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దుకుంటూ వారు జాతి నిర్మాతలుగా నిలుస్తున్నారని కొనియాడారు. ఒక టీకాను కనిపెట్టే శాస్త్రవేత్త, లేదా ఒక ఉపగ్రహాన్ని అంగారక గ్రహం మీదికి పంపించే శాస్త్రవేత్త కూడా జాతి నిర్మాతేనని చెప్పారు. మారుమూల గ్రామంలో రోగిని కోలుకునేలా చేస్తున్న వైద్యులు, నర్సులు.. అంకుర పరిశ్రమ ద్వారా పది మందికీ ఉపాధి కల్పిస్తున్న యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్త కూడా జాతి నిర్మాతలే అవుతారని పేర్కొన్నారు.

“జాతి నిర్మాణాన్ని ప్రభుత్వాలొక్కటే చేయలేవు. మహా అయితే ఒక సదుపాయ కర్తగా, సామాజిక ఔత్సాహికతకు ప్రేరణ శక్తిగా నిలవగలవు. సాటి పౌరుల ఆకలి తీర్చడానికి మండుటెండలో దుక్కిదున్నే రైతన్న... దేశ సరిహద్దుల్ని రక్షించే సైనికుడు... ఉగ్రవాదుల పైనా, నేరగాళ్లపైనా నిరంతరం పోరుసల్పే పోలీసులు, భద్రతా దళాలు... తమ పిల్లల్ని ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న మహిళలు... అంతా జాతి నిర్మాతలే.” అని అన్నారు.

రాష్ట్రపతులుగా సేవలందించిన బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఏపీజే అబ్దుల్ కలాం, ప్రణబ్ ముఖర్జీ తదితరుల్ని కోవింద్ గుర్తు చేసుకున్నారు. మహాత్మాగాంధీ నేతృత్వంలో వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు సాగించిన అలుపెరగని పోరాటాలతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. ఆత్మగౌరవం, గణతంత్ర విలువల గురించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రజల్లో మానవ గౌరవ విలువల్ని పాదుకొల్పారని కోవింద్ పేర్కొన్నారు. కేవలం రాజకీయ స్వాతంత్ర్యం సరిపోదనీ, కోట్లాది మందికి ఆర్థిక, సామాజిక స్వేచ్ఛను సాధించడమూ కీలకమని ఈ నేతలంతా విశ్వసించారని చెప్పారు.

చిన్న గ్రామంలో పూరి గుడిసెలో పుట్టిన తాను జీవితంలో పైకి ఎదిగిన తీరును కోవింద్ గుర్తు చేసుకున్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి రాజ్యాంగ పీఠికలో రాసుకున్నదే మూల మంత్రమనీ, మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు అదే పరిష్కారమని చెప్పారు. ఈ మూల మంత్రాన్నే తాను నిరంతరం అనుసరిస్తానని ప్రకటించారు. ఈ గొప్ప దేశంలోని 125 కోట్ల మంది ప్రజలకూ తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నాననీ, వారు తనపై ఉంచిన విశ్వాసానికి తగ్గట్టుగా నడుచుకుంటాననీ చెప్పారు. తన బాధ్యతల్ని వినమ్రతతో నిర్వర్తిస్తానన్నారు. దీనికి తగ్గ శక్తిసామర్థ్యాలను ప్రజలు తనకు ఇస్తారని ఆకాంక్షించారు. “భారతీయ సంస్కృతి, మృదువైన స్వభావం దృష్ట్యా అనేక అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం కోసం ఇప్పుడు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. ఉగ్రవాదం, అక్రమ నగదు చలామణీ, వాతావరణ మార్పులు వంటి ఎన్నో సమస్యలకు పరిష్కారాన్ని భారత్‌లో చూస్తున్నాయి. మన దేశ బాధ్యతలూ విశ్వవ్యాప్తమయ్యాయి,” అని చెప్పారు. పార్లమెంటు సెంట్రల్‌హాల్‌తో తన జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒక అంశంపై ఏకీభవించినా, విభేదించినా ఒకరినొకరు గౌరవించుకోవడమే ప్రజాస్వామ్య సౌందర్యమని చెప్పారు. కార్యక్రమానికి గవర్నర్లు, ముఖ్యమంత్రులు, సీనియర్ రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు, ఇతర అతిథులు హాజరయ్యారు.

**– జనసందేశ్ ప్రతినిధి**




**ముఖచిత్ర కథనం**

# ప్రతి ఇంటికీ కమలం చేరాలి!

• భువన







పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు వేదికగా బిజెపి తెలంగాణ ఎన్నికల పోరాటానికి సిద్ధమైంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా కదనోత్సాహంతో ముందడుగు వేసింది. వరంగల్‌లో జూలై 22, 23న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశనం చేశాయి.

రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో బిజెపి నాయకులకు కేంద్ర మంత్రులు హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్, బండారు దత్తాత్రేయ దిశా నిర్దేశం చేయగా... జాతీయ నాయకులు పి.మురళీధర్ రావు, రాంమాధవ్ విజయకాంక్షను రగిలించారు. ఇక పార్టీ రాష్ట్రాధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ స్ఫూర్తిదాయక ప్రసంగంతో కొత్త శక్తి నింపారు. పార్టీ సంస్థాగత నిర్మాణ ఆవశ్యకతను నొక్కి చెప్పారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలన్నారు. విస్తారక్ యోజనలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార సాహిత్యం చేరవేశామని, ప్రతి ఇంటిలో ప్రధాని నరేంద్రమోదీ కొలువయ్యారని అన్నారు. మోదీ వెళ్లిన ప్రతి ఇంటికీ కమలం చేరాలని పిలుపునిచ్చారు. ఇందుకు వరంగల్ నుంచే కార్యాచరణ మొదలుపెట్టాలని స్పష్టం చేశారు.









(బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ప్రారంభిస్తూ చేసిన అధ్యక్షోపన్యాసం)

**మిత్రులారా! నమస్కారములు.**

బిజెపి, ఎన్‌డిఎ తరపున పోటీ చేసిన రామ్‌నాథ్ కోవింద్ బ్రహ్మాండమైన విజయం తర్వాత దేశవ్యాప్త ఆనందోత్సాహాల మధ్య మనం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను జరుపుకొంటున్నాము. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విజయం తర్వాత మరొక విజయ వార్త త్వరలో వినబోతున్నాం. మన తెలుగువారు, మన మధ్యలో నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన అందరికీ సుపరిచితుడు, అందరినీ ఆప్యాయంగా పలకరించే నాయకుడు ఎం.వెంకయ్య నాయుడు భారత ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. గెలుపు తథ్యం. ఇది మనకు ఎంతో సంతోషాన్ని కలిగించే విషయం.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని ముగ్గురు సామాన్య కుటుంబాల నుండి రాజకీయాల్లోకి వచ్చి పార్టీ సిద్ధాంతాలకు, నియమాలకు కట్టుబడి పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగిన వారే. సామాన్య బిజెపి కార్యకర్తలు నేడు దేశ అత్యున్నత పదవులకు ఎంపిక కావడం పార్టీలో పనిచేస్తున్న సామాన్య కార్యకర్తలకు, మనకు స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్ షాకు ధన్యవాదాలు.

జనసంఘ్‌కు సంబంధించిన రాష్ట్రస్థాయి సమావేశాలు వరంగల్‌లో రెండుసార్లు జరిగాయి. బిజెపి సమావేశాలు నాలుగుసార్లు జరిగాయి. 1961లో మొట్టమొదటిసారిగా వరంగల్‌లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. 1973లో జనసంఘ్ రాష్ట్ర ప్రతినిధి సభ వరంగల్‌లో జరిగింది. 1986లో వరంగల్‌లో మొట్టమొదటిసారిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అద్వానీ పాల్గొన్నారు. తరువాత 1993, 1997, 2009లలో మొత్తం 4 సమావేశాలు జరిగాయి. అయితే తెలంగాణ ఏర్పాటు తరువాత మొట్టమొదటిసారిగా, రాజకీయంగా ఎంతో ప్రాధాన్యమున్న వరంగల్‌లో ఈ కార్యవర్గ సమావేశం జరుగుతున్నది.

ఓరుగల్లు రాజధానిగా కాకతీయులు రెండు శతాబ్దాల పాటు నిరాటంకంగా, ఎంతో జనరంజకంగా తెలంగాణతో పాటు యావత్ దక్షిణ భారతాన్ని పాలించారు. కాకతీయ వీరనారీ, పరిపాలన దక్షురాలు రుద్రమదేవి ఈ గడ్డపైనే పుట్టింది. ఆ కాలంలోనే కాకతీయులు సాగునీటి వనరుల కోసం గొలుసుకట్ట చెరువులు తవ్వించి, వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేశారు.

నేటి పాలకులు ఇంత గొప్ప కాకతీయుల చరిత్రకు స్థానం లేకుండా చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అయినా కాకతీయుల గొప్పదనాన్ని చాటుతారనుకుంటే ముఖ్యమంత్రి కెసిఆర్ 'ప్రపంచంలోనే అతి గొప్పరాజు నిజాం ప్రభు' అని కీర్తిస్తున్నాడే కాని కాకతీయుల వైభవాన్ని వర్ణించేందుకు నోరు రావడం లేదు. నేటి ఎంఐఎం నాయకులు నాటి రజాకార్ల వారసులే కాబట్టి వారుసైతం నిజాం వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. మైనారిటీల సంతుష్టీకరణ విధానంలో భాగంగా కాంగ్రెస్ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ఏనాడూ ప్రోత్సహించిన పాపాన లేవు. బిజెపి విధానాలైన 'ప్రతి చేనుకు నీరు- ప్రతి చేతికి పని' అనే నినాదం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, అభివృద్ధి, తదితర కాకతీయుల పరిపాలనా విధానాలకు చేరువగా ఉన్నాయి. కాబట్టి కాకతీయుల వారసత్వాన్ని మనమే కొనసాగించాలి.

మనం కాకతీయుల వారసులుగా ఓరుగల్లు చరిత్ర, గొప్పదనాన్ని గుర్తించి మన ప్రభుత్వం ద్వారా వరంగల్‌ను హెరిటేజ్ నగరంగా ప్రకటించాం. హెరిటేజ్ నగరంతోపాటు కేంద్ర ప్రభుత్వం వరంగల్‌ను స్మార్ట్ సిటీగా, అమృత్ సిటీగా కూడా ప్రకటించింది. తద్వార వరంగల్ అభివృద్ధికి పెద్దపీట వేసింది.

## మోదీ పాలనకు మన్ననలు

మిత్రులారా!.. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వ మూడు సంవత్సరాల పాలన ప్రజల మన్ననలు అందుకుంది. ఒక్క అవినీతి మరక లేకుండా.. పారదర్శకంగా, సమర్థవంతంగా పాలిస్తూ దేశంలోనే కాదు ప్రపంచ దేశాలు సైతం ప్రధాని మోదీని కీర్తించడం బిజెపి కార్యకర్తలుగా మనకు గర్వకారణం. ప్రపంచ దేశాల్లో భారత్‌ను చులకనగా చూస్తున్న సమయంలో ఒక వివేకానందుని మాదిరిగా- ఆ నరేంద్రుడి స్థానంలో ఈ నరేంద్రుడు- మోదీ, ప్రపంచ దేశాల్లో మన దేశానికి గౌరవస్థానం లభించేటట్లు కృషి చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి మేలు చేకూర్చే సుమారు 106 సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది. ఇటీవల 'పల్లెపల్లెకు బిజెపి-ఇంటింటికి మోదీ' కార్యక్రమంలో పల్లెపల్లెకు వెళ్లిన బిజెపి నేతలకు ప్రజలే కేంద్ర



నేను, నా దేశం - ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. - డా॥ బి.ఆర్.అంబేద్కర్

పథకాలను వివరిస్తూ ప్రధాని పనితీరును మెచ్చుకోవడం విశేషం. పెద్ద నోట్ల రద్దు అక్రమార్కులు, పన్ను ఎగవేతదారులకు చెక్ పెట్టింది. సాహసోపేతమైన ఈ చర్య దీర్ఘకాలంలో దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రస్తుతం చైనా, పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. మన సైనికులు ధైర్యంగా నిలబడి వారి చర్యలను అడ్డుకుంటున్నారు. వారికి మనం ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలి. మన సైనికులు పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రవాద మూకలపై దాడి చేసిన సంఘటన.. ప్రధాని సాహసోపేత నిర్ణయానికి నిదర్శనం. ఓబీసీ జాతీయ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్న దశాబ్దాల డిమాండ్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు బేఖాతరు చేస్తే నరేంద్ర మోదీ మాత్రం వెనకబడిన వర్గాల మేలు కోసం ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించారు.

‘ఒకే దేశం – ఒకే పన్ను’ నినాదంతో 18 రకాల పన్నులను రద్దు చేసి ఒకే ఒక్క జీఎస్‌టీని ప్రవేశపెట్టి, పన్ను విధానాన్ని సరళతరం చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ నిర్ణయంతో పన్ను ఎగవేతకు మార్గాలు మూసుకుపోయాయి. ఇది దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది.

## రాస్తే రామాయణం.. చెబితే భారతం

మిత్రులారా!... మన రాష్ట్రం విషయానికి వస్తే.. తెలంగాణలో అస్తవ్యస్త పాలన కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి కెసిఆర్ హామీల గురించి రాస్తే రామాయణం – చెబితే భారతం అవుతుంది. ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం అన్న హామీ అమలు కాలేదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేస్తున్న నోటిఫికేషన్లు, నియామకాల ప్రక్రియ నవ్వులపాలు అవుతోంది. చివరకు న్యాయస్థానాలు జోక్యం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయుల నియామకాన్ని రాష్ట్ర హైకోర్టు నిలిపివేసింది. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల నిర్వహణలోని గందరగోళ పరిస్థితులు... అభ్యర్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

రాష్ట్ర మంత్రులపై అవినీతి ఆరోపణలు... సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో అక్రమాలు... హెచ్‌ఎండిఎ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, భూముల కుంభకోణాలు; వాణిజ్య, రవాణా శాఖలో కుంభకోణాలు.. ఒకటేమిటీ ఇంచుమించు అన్ని శాఖల్లో అవినీతి రక్కసి విచ్చలవిడిగా విజృంభిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి మౌనం దాల్చడం ఆందోళన కలిగించే విషయం. ఈ అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి బాధ్యులకు శిక్షలు పడేట్లు చేయాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకంగా ముఖ్యమంత్రి బాధ్యత.



రాష్ట్ర రాజధాని హైదరాబాద్ డ్రగ్స్ మాఫియాకు కేంద్రంగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. స్కూల్, కాలేజ్ విద్యార్థులు కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడేట్లు చేస్తున్నారన్న వార్త లక్షలాది మంది తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తుంది. అనేక సంవత్సరాలుగా ఈ దందా కొనసాగుతున్నప్పటికీ టీఆర్ఎస్ మూడేళ్ల తర్వాత నిద్రలేచి హడావుడి చేయడం ఈ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుంది. హైదరాబాద్‌లో డ్రగ్స్, పబ్ కల్చర్ పెరిగిపోతున్నది. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. ‘ముఖ్యమంత్రి మాటలు వింటే కడుపు నిండుతుంది – చేతలు చూస్తే కడుపు మండుతోంది’

రాష్ట్రంలో హరితహారం కార్యక్రమం ఫోటోలకే పరిమితమైంది. ఈ కార్యక్రమంలో నాటే మొక్కల కన్నా ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలే ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. వేల కోట్లు వెచ్చించి చేపట్టిన ఈ కార్యక్రమం ఆశించిన ఫలితాలను అందించడం లేదు. రైతులను, ఇతర అన్ని పక్షాలను భాగస్వామ్యం చేయక.. కేవలం ఒక రాజకీయ కార్యక్రమంగా నిర్వహించడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. అన్ని వర్గాలను భాగస్వామ్యం చేసి, హరితహారాన్ని దిగ్విజయం చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరుతున్నాం.

రాష్ట్రంలో రైతులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. రైతుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ‘ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన’లో రైతులను చేర్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది.

నేటికీ దళితులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్లలో కొంత మంది దళిత యువకులపై పోలీసులు థర్డ్ డిగ్రీని ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారు. దీనికి బాధ్యులైన ఎస్పీని, ఇతర పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

మహిళా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. 2 పడక గదుల ఇంటి కోసం మహిళలు ఉద్యమాలు చేస్తున్నారు. రాష్ట్రంలో నేటికీ బాలింతల మరణాలు ఆగడం లేదు.

సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు ఎంతో పవిత్రమైన రోజు. నిజాం నిరంకుశత్వం, ఘోరాలు, నేరాల నుండి బయటపడిన రోజు. సర్దార్ పటేల్ సాహసోపేతమైన చర్యను ఎల్లకాలం గుర్తుంచుకుని వారికి జోహార్లు

అర్పించే దినం. ఎన్నికల సమయంలో సెప్టెంబర్ 17 గొప్పతనాన్ని ప్రతి మీటింగ్‌లో చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వక్ర బాష్యాలు చెబుతూ; మజ్లీస్ ఒత్తిళ్ళకు తలొగ్గుతూ తప్పించుకునే ప్రయత్నం చేయడాన్ని తెలంగాణ ప్రజలు క్షమించరు. ఇది అమరుల త్యాగాలను అవమానించడమే. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోరాట యోధుల త్యాగాలను గుర్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంలో వెనుకంజ వేస్తే బిజెపి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమాన్ని చేపడుతుంది.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇతోధికంగా సహాయం చేస్తున్నది. మెదక్ జిల్లా జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తుల మండలి (నిమ్జ్)కి అవసరమైన మౌలిక వసతుల కోసం రూ.740 కోట్ల నిధులను సమకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. జహీరాబాద్ నిమ్జ్ వల్ల సుమారు 2.50 లక్షల మంది తెలంగాణ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కేంద్రం తాజాగా 61 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, రెండు మోడల్ స్కూళ్ల బాలికల హాస్టల్ భవనాల నిర్మాణం కోసం రూ.108.95 మంజూరు చేసింది. ఇటీవలే కొత్తగా కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి 84 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను మంజూరు చేసింది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న కొత్త రైలు మార్గాలను ఏర్పాటు చేయడం, కొత్తరైళ్లను మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ సహాయంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు పథకాలు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రాష్ట్రంలోని 17 ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహాయం అందించింది.

యాదగిరి గుట్ట నుండి వరంగల్ వరకు రూ.2వేల కోట్లతో జాతీయ రహదారి నిర్మాణం పనులు చేపట్టింది. పర్వతగిరి మండలాన్ని రూర్బన్ క్లస్టర్‌గా ప్రకటించింది. వరంగల్ మెగా



టెక్స్‌టైల్ పార్క్ కోసం కేంద్రం 1200 ఎకరాలకు పర్యావరణ అనుమతులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను, పథకాలను రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా ప్రచారం చేసుకుంటున్నారు తప్ప ఎక్కడ కూడా కేంద్రం, మోదీ పేరెత్తడం లేదు.

మిత్రులారా..! తెలంగాణలో పార్టీ బలపడటానికి, అధికారంలోకి రావడానికి రాష్ట్ర పార్టీ అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్న విషయం మీకు తెలిసిందే. తెలంగాణలో అమిత్ షా మూడు రోజుల నల్గొండ జిల్లా పర్యటన రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రతిపక్షాలను కలవరపర్చింది. కొంతమంది నిద్రలేని రాత్రులు గడిపారు. తెలంగాణలో బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేయడానికి విస్తారక్ యోజనలో భాగంగా 6 వేల మంది కార్యకర్తలు 15 రోజుల పాటు 20 వేల పోలింగ్ బూత్‌ల్లో పర్యటించి, కమిటీలు వేసి పార్టీలో నూతన శక్తిని నింపడం జరిగింది. రాష్ట్రంలో 15 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించారు. కేంద్రమంత్రులు వీటిలో పాల్గొన్నారు. 'పల్లె పల్లెలో బిజెపి – ఇంటింటికి మోదీ' విజయవంతమైంది. సుమారు కోటి కరపత్రాలు పంపిణీ చేశాం. పార్టీని పటిష్టం చేయడానికి ప్రతి అసెంబ్లీకి ఒకరు చొప్పున పూర్తి సమయ కార్యకర్తలను నియమించాం. ఈ సదస్సులను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మోదీ ఫెస్ట్, సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ ప్రచార కార్యక్రమాలను దాదాపు 30 నగరాలు, పట్టణాలలో విజయవంతంగా కొనసాగాయి. మోదీ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు దోహదపడ్డాయి. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. 'సహకరించిన మిత్రులకు ధన్యవాదాలు'.

ప్రధాని నరేంద్ర మోదీ, బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్ షా నాయకత్వంలో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' దేశవ్యాప్తంగా విజయవంత మవుతున్నది. అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ కుంచించుకుపోయింది. కాంగ్రెస్ జమానా అవినీతి జమానాగా పేరుగాంచింది. మూడు పూలు, ఆరు కాయల మాదిరిగా, మూడు స్కీంలు, ఆరు స్కామ్‌లుగా పేరుపడింది. ఇక్కడా 'కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ' కావడం ఖాయం.

మిత్రులారా!... రాబోయే రోజులు మనకు పరీక్షా సమయం. 2019 ఎన్నికలలో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావాలంటే కష్టనష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఇది మనకొక సువర్ణావకాశం. దేశంలోని అనేక రాష్ట్రాలలో బిజెపి విజయ పరంపర కొనసాగింది. అది తెలంగాణలో కూడా ప్రతిబింబించాలి. దీన్ని చేజార్చుకోవద్దు. రాష్ట్రంలో ఇంటింటికి నరేంద్ర మోదీ కార్యక్రమాలతో పాటు బిజెపి కమలం చేరింది. మనకు విస్తారక్ యోజనలో ఇది అనుభవమైనది. కౌరవులు వందమంది, పాండవులు ఐదుగురే. కానీ విజయం పాండవులనే వరించింది. కృష్ణుడి వల్ల పాండవులు విజేతలుగా నిలిచారు. ప్రస్తుతం కృష్ణుని పాత్రలో నరేంద్ర మోదీ ఉన్నారు. విజయం మనదే. అధికారం మనందరిది. ఆత్మవిశ్వాసంతో, సంకల్ప బలంతో మనం ఇక్కడ్నించి కార్యక్షేత్రానికి బయలు దేరుదాం.

అందుకే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ బూత్‌కు 25 మంది చొప్పున అక్టోబర్, నవంబర్ మాసాలలో నిర్ణయించిన తేదీలలో అసెంబ్లీ సమ్మేళనాలు నిర్వహించి 2019 ఎన్నికలకు సమాయత్తం కావాలి.

**భారత్ మాతా కీ జై.**

**జై భారత్.... జై బిజెపి... జై తెలంగాణ..**




# టీఆర్ఎస్‌తో నిత్య యుద్ధమే

తెలంగాణలో టీఆర్ఎస్‌తో ఇక నుంచి బిజెపిది నిత్యం యుద్ధమేనని రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ప్రసంగించిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తేల్చి చెప్పారు. 2019 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడమే జాతీయ నాయకత్వ లక్ష్యమని, తెలంగాణ నుంచీ పెద్దసంఖ్యలో లోక్‌సభ సభ్యులుండాలని, అందుకోసం పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలు వేరు ఎన్నికలు వేరనీ, తెలంగాణలో ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో సంఘర్షణ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కొన్ని పార్టీల సహకారం కావాలి కనుక కలుపు కొనిపోయామని చెప్పారు. ప్రధాని మోదీ ఇమేజ్‌తో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విమర్శలకు తావులేకుండా ఐకమత్యంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. మతం పేరుతో రిజర్వేషన్లు ఇస్తామంటే ఊరుకునేది లేదని, ఈ విషయంలో టీఆర్ఎస్‌ను, ఎంఐఎంను వ్యతిరేకిస్తామన్నారు.

సాధారణంగా అధికారంలో ఉంటే పాపులారిటీ తగ్గుతుందని, ఇందుకు భిన్నంగా ప్రధాని మోదీ పాపులారిటీ రోజురోజుకూ పెరుగుతోందని, ప్రధానికి 77 శాతం పాపులారిటీ ఉందని పేర్కొన్నారు. మోదీ లాంటి నాయకుడు లభించడం మన అదృష్టం, గర్వకారణమని అన్నారు. అవినీతి నిర్మూలన బిజెపికి నినాదం కాదని... చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నమని చెప్పారు. అవినీతిని పైస్థాయి నుంచి నిర్మూలిస్తూ రావాలని, మోదీ ఇదే చేస్తున్నారని తెలిపారు. నోట్లరద్దు నుంచి జీఎస్టీ వరకు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు అవినీతిని నిర్మూలించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుడు వచ్చే ఎన్నికలను మాత్రమే చూస్తాడని, దార్శనికుడు వచ్చే తరాన్ని చూస్తాడని... మోదీ ఓ దార్శనికుడని వర్ణించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుపై అవినీతి విమర్శలు వచ్చాయని గుర్తు చేసిన రాంమాధవ్.. ప్రపంచంలో ఏ వ్యక్తి కూడా ప్రధాని మోదీతో అవినీతి చేయించలేదని కుండబద్దలు కొట్టారు. ప్రతిపక్ష నాయకుడిపై వచ్చే జోకులు వాస్తవాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు.



నోట్ల రద్దుతో సామాన్యులకు ఇబ్బందులు ఎదురైనా మోదీ నిర్ణయాన్ని స్వాగతించారని అన్నారు. సామాన్యుడైన సగటు భారతీయుడు నీతిమంతుడేనని రాంమాధవ్ అన్నారు. బిజెపిది రిఫార్మ్ ఎజెండా కాదని.. ట్రాన్స్‌ఫార్మ్ ఎజెండా అని స్పష్టం చేశారు. యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా ప్రవేపెట్టారన్నారు. మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకం పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. 'సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్' నినాదంతో అన్ని వర్గాలను కలుపుకొని సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని తెలిపారు. అధికారంలోకి వచ్చినవారు వ్యవస్థను మార్చాలని, ఇందుకు ధీరోదాత్తమైన నాయకత్వం కావాలని, మోదీ రూపంలో బిజెపికి మంచి నాయకత్వం ఉందని చెప్పారు.

### సేవ కోసమే అధికారం

అధికారాన్ని చేజిక్కించుకోవడమే రాజకీయాల లక్ష్యం అని.. అయితే ఆ అధికారం ప్రజాసేవ కోసమేనని స్పష్టం చేశారు. సిద్ధాంతం ఆచరణలో చూపించాలంటే అధికారం ఉండాలని అన్నారు. రాజకీయాల్లో పార్టీహితం ముఖ్యమని, భావోద్వేగాలకు తావుండదని అన్నారు. "రాజకీయాల్లో చారిటీ చేయడం కోసం మనం ఉండం. చారిటీ చేయాలంటే అనేక ఇతర సంస్థలుంటాయి. అధికారాన్ని చేజిక్కించు కోవడానికి మాత్రమే పాలిటిక్స్ చేస్తాం. ది ఎయిమ్ ఆఫ్ పాలిటిక్స్ ఈజ్ టు క్యాప్చర్ పవర్ (రాజకీయాల లక్ష్యం అధికారాన్ని దక్కించు కోవడమే). దాంట్లో ఎవరికీ ఎటువంటి సందేహం ఉండాల్సిన అవసరం లేదు. ఎప్పుడు ఏ ఎన్నిక వచ్చినా కూడా బిజెపి సాధ్యమైతే స్వీయబలంతో విజయం సాధించడానికి ప్రయత్నం చేయాలి. దాని కోసం పార్టీ మిషనరీని(యంత్రాంగాన్ని) మనం తయారుగా ఉంచాలి." అని చెప్పారు. అయితే ఆ అధికారం ప్రజాసేవ కోసమేనని స్పష్టం చేశారు. చాలా క్లిష్టమైన రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించు కోగలిగాం. రాజకీయాల్లో ఎమోషన్స్‌కు స్థానం ఉండదంటూ.. "అరె పాపం మనవాడే కదా మొన్నటిదాకా.. అనేది పనిచేయదు. పాలిటిక్స్ హ్యాజ్ టు బి కోల్డ్‌బ్లడెడ్ (రాజకీయాలు కర్కశంగా ఉండాలి). పార్టీ హితం, పార్టీ లక్ష్యాల్ని సాధించడానికి అధికారానికి దగ్గర కావడం.. ఒక పార్టీగా నిరంతరం అన్ని స్థాయిల్లో మనం చేయాలి. సర్పంచ్ నుంచి మొదలుపెట్టి శాసనసభ వరకూ ఏ ఎన్నిక వచ్చినప్పటికీ దాన్ని గెలవడానికి అవసరమైన తయారీతో మన పార్టీ ఉండాలి," అని అన్నారు. తెలంగాణలో 2019లో బిజెపి అధికారంలోకి రావాలని, కేంద్ర నాయకత్వం ఇదే ఆశిస్తుందని చెప్పారు.

ప్రపంచం మొత్తమ్మీదా అత్యంత క్రమశిక్షణ కలిగిన, వ్యవస్థీకృత పద్ధతుల్లో నడిచే పార్టీ బిజెపి అని స్పష్టం చేశారు. తెలంగాణలోనూ పార్టీకి ఘన చరిత్ర ఉందని తెలిపారు. తెలంగాణలో పార్టీ కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. బిజెపిలో పదవులు, బాధ్యతలను మీడియా నిర్ణయించదని.. పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని, కార్యకర్తలు దానికి అనుగుణంగా పనిచేస్తారని పేర్కొన్నారు. దేశంలో చాలా రాష్ట్రాలు నవీన భారత నిర్మాణంలో మోదీతో భుజం కలిపి నడవడానికి సిద్ధంగా ఉన్నాయని, కొన్ని రాష్ట్రాలు ఇంకా మిగిలి ఉన్నాయని చెప్పారు. ■

సంస్థాగతం

# కేసీఆర్ హామీలు నీటి మీది రాతలు

(వరంగల్‌లో జూలై 22, 23న జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆమోదం పొందిన రాజకీయ తీర్మానం)



తెలంగాణలో ప్రజల ఆశలు గల్లంతయ్యాయి. అనేక ఆశలతో, ఆశయాలతో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సకల జనులంతా ఉద్యమించిన నేపథ్యంలో బిజెపి మద్దతుతో తెలంగాణ సాకారమయ్యింది. తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. ఇందు లేదు అందు కలదనే సందేహం లేదన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో అవినీతి స్వైర విహారం చేస్తున్నది. మంత్రులకు, పాలనా యంత్రాంగానికి మధ్య అగాధం రోజురోజుకు పెరిగిపోతున్నది. మూడేళ్ల తరువాత కూడా ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను టీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. పైగా నూటికి నూరుపాళ్లు మ్యానిఫెస్టోను అమలు చేసిన పార్టీ మాదేనంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్నారు. మంత్రులను నిర్వీర్యం చేయడంతో పాలనపై కుటుంబ పెత్తనం పెరిగిపోయింది.

## పెచ్చరిల్లుతోన్న అవినీతి

ఈ రాష్ట్రంలో ప్రతి శాఖలో అవినీతి పెచ్చరిల్లిపోతున్నదని ఇటీవల జరిగిన ఘటనలు నిరూపిస్తున్నాయి. ఇసుక మాఫియాతో పాటు ఇరిగేషన్‌లో డిజైన్ల మార్పిళ్ల పేరిట అంచనాలను వేలాది కోట్ల రూపాయలకు పెంచుతూ ప్రాజెక్టులలో అవినీతి గేట్లు తెరిచారు. అదేవిధంగా రెవెన్యూశాఖలోనూ ఇదే తంతు కొనసాగుతున్నది. విలువైన భూములను ప్రజా ప్రతినిధులే తక్కువ ధరకు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వేలాది కోట్ల రూపాయల అవినీతి బయటపడినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. మియాపూర్, భోజగుట్ట భూకుంభకోణాలను కనీసం పట్టించుకోవడంలేదు. అవినీతికి పాల్పడిన ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోలేదు. ఎక్కడ అవినీతి జరిగినా నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు అంటూ టోల్‌ఫ్రీ నెంబర్ ప్రజలకు ఇచ్చిన ముఖ్యమంత్రికి ఎన్ని ఫిర్యాదులు వచ్చినా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. ఈ భూ కుంభకోణంలో ముఖ్యమంత్రి బంధువులకు, అనుయాయులకు సంబంధం ఉందని తెలిసినప్పటికీ వారిని ప్రభుత్వం కాపాడుతున్న విధానాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తున్నది.

## వాగ్దానాల అమలులో వైఫల్యం

తెలంగాణలోని అన్ని జిల్లాల్లో భూ బకాసురులు యథేచ్ఛగా భూములను క్రమబద్ధీకరించుకుంటే నిరుపేదలకు నివాసానికి కూడా భూమి ఇవ్వడంలేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానంటూ ప్రకటించిన కేసీఆర్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తయిన తరువాత కూడా మూడు అడుగులు కూడా ముందుకు జరగలేదు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూమ్ పథకం కూడా నత్తనడక నడుస్తున్నది. అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ ఈ పథకం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 31 జిల్లాల్లో రెండున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం 10 వేల ఇండ్ల పనులను కూడా ప్రారంభించలేదు. 700 రోజుల్లో ప్రభుత్వ కాలపరిమితి పూర్తవబోతున్నది. ఇంకా టెండర్ల స్థాయిలోనే డబుల్ బెడ్‌రూమ్ పథకం ఊగిసలాడుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లక్ష ఇండ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తే ఆ నిధులను కూడా దారి మళ్ళించడంపై బిజెపి రాష్ట్ర కార్యవర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది.

జిల్లాలు, మండలాల పునర్విభజన చేసి పది నెలలు కావస్తున్నప్పటికీ అధికార పార్టీ నాయకుల ఒత్తిడుల కారణంగా ఏడు జిల్లా కేంద్రాలు వివాదాస్పదమయ్యాయి. ఇక మండలాల సంగతి సరేసరి. 125 కొత్త మండలాలు ఏర్పాటు చేసినా, కనీస వసతులు కూడా లేక వెలవెలబోతున్నాయి. ఒకవైపు రాష్ట్రంలో వివిధ శాఖలు సిబ్బంది కొరతతో సతమతమవుతుండగా దాదాపు 50 డిప్యూటీ కలెక్టర్లకు సంవత్సరం నుండి పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడం శోచనీయం. పాలనా యంత్రాంగంపై ముఖ్యమంత్రి దృష్టి కేంద్రీకరించాలని, ప్రభుత్వ పనితీరు మెరుగుపర్చాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం కోరుతున్నది.

కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తానన్న ముఖ్యమంత్రి గత నాలుగు బడ్జెట్‌లలో 62 వేల కోట్లు కేటాయించి 42 వేల కోట్లు ఖర్చుపెట్టినప్పటికీ అదనంగా లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు. ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసే సమయంలో స్పష్టమైన విధానాన్ని పాటించడం లేదు. ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో రకంగా పరిహారం చెల్లించడం ద్వారా రైతులపట్ల వివక్ష చూపుతున్నది. భూసేకరణ విషయంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

## నిరుద్యోగులతో ఆటలు

తెలంగాణ విముక్తి పోరాటంలో విద్యార్థులు, యువకుల త్యాగాలను మర్చిపోనని, తెలంగాణ యువతకు లక్ష ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ విషయంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లకే పరిమితవుతున్నాయి తప్ప ఉద్యోగాలు మాత్రం ఎవరికీ రావడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు అనే పదమే ఉండదని చెబుతూ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేస్తానని చెప్పిన మాట నీటిమూటే అయింది. అదేవిధంగా మూడేళ్లయినప్పటికీ టీచర్ల భర్తీ (డిఎస్సీ) నిర్వహించకపోవడం, గురుకుల ఉపాధ్యాయుల భర్తీ, గ్రూప్–2

బ్యాక్‌లాగ్ పోస్టులు, సింగరేణి వారసత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైనది. బాలికల గురుకుల విద్యాలయాలలో వంద శాతం ఉద్యోగాలు మహిళలకే కేటాయించే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల హైకోర్టు స్టే ఇవ్వడంతో నియామక ప్రక్రియ నిలిచిపోవడం విచారకరమని బిజెపి రాష్ట్ర కార్యవర్గం భావిస్తున్నది.

### శాంతిభద్రతలు అథమం

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో దేశంలోనే ఆదర్శంగా ఉన్నామని, క్రైం రేటు రోజురోజుకు తగ్గిపోతున్నదని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్రంలో జరుగుతున్న నేర ఘటనలు కనిపించడం లేదా? ఇటీవల రాష్ట్రంలో బయటపడిన డ్రగ్ మాఫియా, కల్తీ తదితర అంశాలు తెలంగాణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అసలు దోషులను తప్పించి డ్రగ్ మాఫియాను సినిమా రంగానికి, విద్యాసంస్థల చుట్టే తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. పంజాబ్ రాష్ట్రాన్ని తలపించే విధంగా డ్రగ్స్, హుక్కా, గుట్కా సంస్కృతి హైదరాబాద్ యువతను అతలాకుతలం చేస్తున్నది. దీంతోపాటు ఆహార పదార్థాలు, ఔషధాల కల్తీతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనేక జిల్లాల్లో నేర ఘటనలు పెరుగుతున్నాయి. ఇసుక మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతుంది. ఇసుక సరఫరాదార్లను పోలీసు యంత్రాంగం వత్తాసు పలుకుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక మాఫియాను అడ్డుకున్న దళితులపై దాడులను బిజెపి రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తున్నది.

సెప్టెంబర్ 17ను అధికారికంగా జరుపుకోవాలని, ఉద్యమ సమయంలో గొంతెత్తి చాటిన కేసీఆర్ అధికారంలోకి రాగానే మైనారిటీ ఓట్ల కోసం మాటమార్చారు. రాజ్యాంగ వ్యతిరేకమని తెలిసి, ముస్లింలకు బిసి కేటగిరిలో 12 శాతం రిజర్వేషన్లు ఇస్తానని పదేపదే ప్రకటించడం ముస్లింలను మోసం చేయడంతోపాటు, బిసిలకు అన్యాయం చేయడమే. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని మతపరమైన రిజర్వేషన్ల కల్పించే ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

దేశ ఆర్థిక రంగాన్ని గాడిలోపెట్టి సుస్థిర, వేగవంతమైన అభివృద్ధి సాధించాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ నిబంధనలను పరిష్కరించి ఉపాధ్యాయుల పదోన్నతులకు మార్గం సుగుమం చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే. దేశ అభివృద్ధి, సంక్షేమానికి పలు వినూత్న పథకాలు అమలు చేస్తుంది. ఎన్నో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవా పన్ను (జి.ఎస్.టి) చట్టాన్ని ఆమోదించడం విప్లవాత్మకమైన, సాహసోపేతమైన నిర్ణయాలు. 'ఒకే దేశం- ఒకే పన్ను' విధానం అమల్లోకి రావడం ఆర్థిక సంస్కరణల్లో ఒక మైలురాయి. నల్లధనం, అవినీతి, ఎన్నికలలో ధన ప్రభావం, పన్నుల ఎగవేతలను అరికట్టడానికి ఈ నిర్ణయాలు ఎంతగానో దోహదపడతాయి. నగదురహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టడం పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. దేశ ఆర్థిక వ్యవస్థను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న రుగ్మతల నుండి విముక్తి గావించి, దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి, ప్రపంచంలో భారత్‌ను ఒక ప్రబలమైన ఆర్థిక శక్తిగా నిలపడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.

కేంద్రం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ముదావహం. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపురేఖలు మార్చి నిర్దేశిత కార్యక్రమాలకు కేటాయించకుండా దారి మళ్లించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తన సొంత పథకాలుగా ప్రచారం చేసుకోవడం ఫెడరల్ స్ఫూర్తిని నీరుగార్చడమే. బిజెపి కార్యకర్తలు దీన్ని సవాలుగా తీసుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత చురుకుగా, వేగంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిస్తోంది.

**-జనసందేశ్ ప్రతినిధి**



## అధికారిక విమోచన దినోత్సవం కోసం ఉద్యమం

తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ఉద్యమించాలని రాష్ట్ర కార్యవర్గం నిశ్చయించింది. రాష్ట్రం ఏర్పడిన జూన్ 2 ఎంతటి ప్రాముఖ్యమో నిజాం, రజాకార్ల పీడ నుంచి బయటపడిన సెప్టెంబర్ 17 తెలంగాణకు అంతే ప్రాముఖ్యమని తీర్మానించింది. సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాలను జరిపేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ఇందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి వివరించారు.

**కార్యక్రమాల వివరాలు:**

**ఆగస్టు 9:** తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని తహశీల్దార్‌లకు వినతిపత్రం సమర్పించడం.

**ఆగస్టు 16:** తెలంగాణ విమోచ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించడం.

**సెప్టెంబర్ 7-10:** తెలంగాణ విమోచన దినోత్సవం గురించి ఆర్.డి.ఓ. కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు.

**సెప్టెంబర్ 10-16:** నిజాం అకృత్యాలు జరిగిన స్థలాలో కార్యక్రమాలు, అందుకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులను మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మానించడం.

**సెప్టెంబర్ 17:** తెలంగాణ విమోచన దినం సందర్భంగా అన్ని పోలింగ్ బూత్‌లలో జాతీయ పతాకాన్ని ఎగురవేయడం.

**సెప్టెంబర్ 17:** రాష్ట్రంలోని ఒక ప్రధాన నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం.

సంస్థాగతం

# టీఆర్ఎస్‌ది రైతు వ్యతిరేక విధానం

**(జూలై 22, 23న వరంగల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో అమోదం పొందిన వ్యవసాయ తీర్మానం)**

ప్రత్యేక రాష్ట్ర సాధన తరువాత కూడా రైతుల స్థితి మెరుగుపడుటకు బదులుగా మరిన్ని కష్టాల్లోకి నెట్టబడ్డారు. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నా ప్రభుత్వం మాత్రం రైతుల సంక్షేమంపై నిష్క్రియాపరత్వంగా వ్యవహరిస్తోంది. మాటలు బారెడు చేతలు జానెడు అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉంది. రైతును రాజును చేస్తామన్న ఆర్భాటపు ప్రకటనలు, పత్రిక ఇంటర్వ్యూలకే పరిమితమైంది తప్ప ఆచరణలో మాత్రం రైతుల స్థితి మెరుగుపడలేదు.



తెలంగాణను విత్తన భాండాగారంగా తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వ వాగ్దానం అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల దందా ఓ మాఫియాలా కొనసాగుతున్నది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 2 నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయించే దళారులను అరికట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపులేని కారణంగా నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడులు చేతికి అందక, చేసిన అప్పులు తీరక, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక అవమాన భారంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం నకిలీ విత్తనాలు విక్రయించే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఏఎస్ స్థాయి అధికారితో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

బహుళ జాతి విత్తన కంపెనీల ఆధిపత్యంలో రోజురోజుకు పెరుగుతున్న విత్తనాల ధరల నియంత్రణ, నాణ్యత, అధిక దిగుబడి మరియు అక్రమాలకు పాల్పడేవారిపై కఠినతరంగా ఉండేవిధంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.

కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్దేశించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారార్భాటం కోసం తమ ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బొమ్మల కరపత్రం తప్పిస్తే క్షేత్ర స్థాయిలో చేసింది శూన్యం. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని, రైతులకు దీనిపై అవగాహన సదస్సులు నిర్వహించి బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామాలలో పర్యటించి రైతులు పంట నష్టపోయినప్పుడు పరిహారం పొందేవిధంగా రైతులను బీమా పరిధిలోకి తీసుకురావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకుల నుండి రైతులకు పంట రుణాలు ఇచ్చే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. లక్ష రూపాయల పంట రుణాల మాఫీ నాలుగు సంవత్సరాలలో నాలుగు విడతలుగా చేసినందున, రైతులకు రుణమాఫీ వల్ల ఎలాంటి ప్రయోజనం ఒరగలేదు. ప్రభుత్వం చెల్లించిన డబ్బు వడ్డీకే సరిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి వడ్డీ చెల్లించని కారణంగా రైతులకు ఈ సంవత్సరం పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయి. ఈ సమస్యను రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో చర్చించి లక్ష లోపు పంట రుణాలను వడ్డీలేని రుణాలుగా రైతులకు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని బిజెపి రాష్ట్ర కార్యవర్గం భావిస్తుంది. ఇందుకోసం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

భూసార పరీక్ష కార్డుల వితరణకు కేంద్ర ప్రభుత్వం డబ్బు చెల్లించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కమతాల వారీగా పరీక్షలు నిర్వహించి కార్డులు జారీ చేయడంలో ఘోరంగా విఫలమైనది. రైతులందరికీ భూసార కార్డులు అందజేయాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

రైతులు పండించిన పంటలకు సరైన ధర పొందేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ-నామ్' పథకాన్ని మన రాష్ట్రంలోని అత్యధిక మార్కెట్ యార్డులకు అనుసంధానపరిచింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టని కారణంగా వ్యాపారులు కుమ్మక్కై ఈ-నామ్ పథకపు ఫలాలు రైతులకు దక్కడం లేదు. ఈ-నామ్ పథకాన్ని సక్రమంగా అమలు పరిచి రైతుల పంటలకు అధిక ధరలు లభించేటట్లు తగు చర్యలు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది. మార్కెట్ యార్డులలో ప్రభుత్వం నిర్దేశించిన కమిషన్ కంటే ఎక్కువగా కమిషన్ వసూలు చేయడం, తరుగు, హమాలీ వంటి ఇతరత్రా రుసుముల పేరుతో రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇచ్చేవిధంగా అప్పటి ప్రభుత్వం చట్టం చేసినందున, ఆ చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలుపరిచి, కౌలు రైతులకు కార్డుల మంజూరు చేసి, పంట రుణాలు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

గత సంవత్సరం పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రచారానికి స్పందించి రైతులు కందులు, మిరప, పెసర్ల వంటి పంటల వైపు మొగ్గు చూపినా, పండిన పంటకు తగిన ధర చెల్లించనందున ఈ సంవత్సరం మళ్లీ రైతులు అధిక స్థాయిలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ పత్తి ధర పతనం కాకుండా మార్కెట్‌లలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బిజెపి కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్రంలో చెరకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నిజాం చక్కెర కర్మాగార పరిధిలోని రైతులకు, కార్మికులకు హామీ ఇచ్చిన జివో 28/2015ను అమలు చేయలేదు. అట్టి జివోను అమలుపర్చాలని డిమాండ్ చేస్తున్నాము.

తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఇంకా నత్త నడకన సాగుతోంది. ప్రభుత్వం రీడిజైన్, భూసేకరణ పేరుతో మరింత జాప్యం చేస్తున్నది. ప్రతిపక్షాలపై నెపం నెడుతూ బాధ్యతల నుంచి తప్పించుకుంటోంది. కోటి ఎకరాల మాగాణి సంగతి దేవుడెరుగు చివరికి నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా చుక్క నీరు రాక పది నియోజకవర్గాల్లో పంటలు లేక రైతులు నష్టపోతున్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల మరమత్తుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు పొందలేకపోయింది. టెండర్ల ప్రక్రియలో అక్రమాల కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయినది.

కేంద్ర ప్రభుత్వ రైతు రక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నది. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా వచ్చే సంవత్సరం నుండి ఎకరాకు రూ. 4 వేలు చొప్పున రైతులకు ఇస్తామని ప్రకటించిన సొమ్మును ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచే రైతులకు అందించి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

ఇదే తరహా రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తే రైతు ఆగ్రహానికి గురికాక తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

**–జనసందేశ్ ప్రతినిధి**



- పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి ఉత్సవాల కార్యక్రమాలపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ టి.రాజేశ్వర రావు వివరించారు.
- పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కార్యవిస్తరణ యోజను ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి వివరించారు.
- సంస్థాగత విషయాలను సంఘటనా ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు వివరించారు.
- బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కుమారి సరోజ్‌పాండే రాష్ట్ర పర్యటన వివరాలను ప్రధాన కార్యదర్శి డా॥ జి.మనోహర్ రెడ్డి వివరించారు.
- జిల్లా కార్యాలయాల స్థల సేకరణ, నిర్మాణం సంబంధిత విషయాలను కోశాధికారి బి.శాంతికుమార్ వివరించారు.
- ఆజీవన సహయోగి నిధి గురించి మాజీ ఎమ్మెల్యే బద్ధం బాల్ రెడ్డి తెలిపారు.
- సెప్టెంబర్ 10, 11, 12తేదీల్లో జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్ర పర్యటన వివరాలను ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి వివరించారు.
- రాష్ట్ర కార్యదర్శి వి.ఛాయాదేవి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- అసెంబ్లీ సమ్మేళనాలు, స్థానిక సమస్యలపై మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాల వివరాలను జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.శేఖర్ రావు వివరించారు.
- గత కార్యవర్గ సమావేశాల నుండి నిర్వహించిన కార్యక్రమాలపై జిల్లా అధ్యక్షులు నివేదించారు.
- ఐటీ సెల్ కార్యక్రమాలను ఎ. వెంకట రమణ, ఆర్‌టిఐ సెల్ కార్యక్రమాలను రజనీకాంత్ వివరించారు.
- వేదిక వద్ద పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ ప్రారంభించారు.
- కార్యవర్గ సమావేశ వేదిక పరిసర ప్రాంతాలు బిజెపి జెండాలు, కటౌట్లతో అలంకరించారు.
- సభా ప్రాంగణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, స్వామి వివేకానంద సందేశాలతో కూడిన పోస్టర్లను అతికించారు.
- రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేసి, హాజరైన ప్రతినిధులకు చక్కని వసతి, రుచికరమైన భోజన ఏర్పాట్లు చేసిన బిజెపి వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జిల్లా నేతలను కొనియాడారు.

వర్తమానం

# అజేయంగా రాజస్థాన్ బిజెపి

రాజస్థాన్‌లో మూడు రోజుల పర్యటన కోసం వచ్చిన బిజెపి అధ్యక్షుడు అమిత్ షాకు జూలై 21న ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ పర్నామి, ఇతర సీనియర్ నాయకులు విమానాశ్రయంలో అమిత్ షాకు స్వాగతం పలికారు. విమానాశ్రయం బయట అమిత్ షా వాహన శ్రేణిపై బిజెపి మహిళా మోర్చా కార్యకర్తలు పూల వాన కురిపించారు. ఒక జ్ఞాపిక అందజేశారు. అమిత్ షా సర్దార్ పటేల్ మార్గ్‌లోని బిజెపి కార్యాలయానికి ప్రయాణించిన ఎనిమిది కిలోమీటర్ల మార్గంలో అనేక చోట్ల వేలాది మంది కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బీజేవైఎం కార్యకర్తలు మోటారు సైకిళ్ల మీద ఈ ఊరేగింపునకు ముందు ప్రయాణించారు. మార్గ మధ్యంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు అమిత్ షా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బిజెపి కార్యాలయంలో అమిత్ షా ఇ-గ్రంథాలయం ఆవిష్కరించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి బిజెపిని మరింత పటిష్ట పర్చేందుకు, 2019 ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేసేందుకు అమిత్ షా దేశవ్యాప్త పర్యటనలో భాగంగా రాజస్థాన్‌ను సందర్శించారు.

### అజేయమైన రాజస్థాన్ బిజెపి

రాజస్థాన్ పర్యటన రెండో రోజున విలేకరుల సమావేశంలో మాట్లాడిన అమిత్ షా రాజస్థాన్ బిజెపి అజేయంగా ఉందని చెప్పారు. వచ్చే నాలుగు నెలల్లో ఏ పార్టీ కూడా బిజెపి దరిదాపులకు కూడా రాలేదని అన్నారు. వసుంధరా రాజే బాగా పని చేస్తున్నారని కొనియాడారు. రైతుల రుణమాఫీ ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలే చూసుకోవలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇదివరకే తెలియజేశారని





అమిత్ షా పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సాధించిన పెద్ద నోట్ల రద్దు, పాకిస్థాన్ భూభాగంపై గురి చూసి దాడి చేయడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. రామ మందిర నిర్మాణం గురించి పార్టీ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. గత నాలుగు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ విషయాన్ని ఎన్నికల ప్రణాళికల్లో స్పష్టంగా చెప్తూనే ఉన్నామన్నారు. చట్టం ప్రకారం, పరస్పర సంప్రదింపుల ద్వారా రామ మందిరం నిర్మించాలని చెప్పారు.

### సాధువులతో సమావేశం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాధువులు అమిత్ షాతో చర్చించారు. వారితో రామ మందిర నిర్మాణం, గో సంరక్షణ అంశాలను ప్రస్తావించారు. సాధువులు, సన్యాసులతో బిజెపి నాయకులు రహస్య సమావేశం కూడా నిర్వహించారు. ఈ సమావేశం తర్వాత కాలే హనుమాన్ దేవాలయం మహంత్ గోపాల్ దాస్ మహారాజ్ మాట్లాడుతూ... "అమిత్ షా భారతీయ సంస్కృతి గురించి మాటాడుతూ అనేక ఏళ్లుగా ఈ సంస్కృతికి విఘాతం కలుగుతోందని అన్నారు. దీనిని పరిరక్షించాల్సిన అవసరం మీద దృష్టి కేంద్రీకరించారు." అని తెలియజేశారు. బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలతో అమిత్ షా విడిగా సమావేశమయ్యారు. పార్టీ పదాధికారులు, పార్టీ వివిధ విభాగాల నాయకులను కూడా సంప్రదించారు.

### దళిత కుటుంబంతో భోజనం

మూడవ రోజు పర్యటనలో షా సుశీల్‌పురాలోని దళిత కుటుంబానికి చెందిన యువ మోర్చా సభ్యుడు రమేశ్ పచారియాతో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి వసుంధరా రాజే సింధియా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ పర్నామి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్, కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్, రాష్ట్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి అరుణ్ చతుర్వేది మొదలైన వారికి అక్కడ రాజస్థాన్ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. "అమిత్ షా కోసం మా అమ్మ అన్నం, పప్పు, చపాతి, హల్వా, ఖీర్ వండారు," అని పచారియా తెలియజేశారు. సుషీల్ పురాలో దిగువ మధ్య తరగతికి చెందిన దళితులు ఉంటారు. అక్కడికి అత్యంత ప్రముఖులు రావడం ఇదే మొదటిసారి. అమిత్ షాను చూడడానికి ప్రజలు రోడ్ల మీద బారులు తీరారు. డాబాల మీద చేరారు. ఆయన పచారియా ఇంట్లో గంట సేపు గడిపారు. ఇంటి బయట గుమిగూడిన జనాన్ని పలకరించారు. డాబాల మీద ఉన్న వారికి చేయి ఊపి అభివాదం చేశారు. ఆ తర్వాత పార్టీలో పూర్తికాలం పని చేసే కార్యకర్తలను, సీనియర్ నాయకులను కలుసుకుని చర్చించారు.

–జనసందేశ్ ప్రతినిధి



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ

విశ్లేషణ



# బీహార్: కుహనా సెక్యులర్ రాజకీయాల పరాజయం

• కర్రావు

దేశ రాజకీయాల్లో పెను మార్పులు వస్తున్నాయి. కాంగ్రెస్ ముక్త్ భారత్ నిజం కాబోతోంది. అవినీతికి కూడా దేశం చరమగీతం పాడబోతోంది. ఇంతకాలం సెక్యులరిజం పేరిట చాలా రాజకీయ పార్టీలు అవినీతిని భరిస్తూ వచ్చాయి. కానీ ఇప్పుడు అవినీతిని భరించే స్థితిలో ఈ దేశప్రజలు లేరన్న వాస్తవం వారికి అర్థమవుతోంది. ఫలితంగా అవినీతి పార్టీలన్నీ ఏకాకి అవుతున్నాయి. అవినీతి వ్యతిరేక పోరాటంలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరుగుతోంది.

ఈ పునరేకీకరణకు కేంద్ర బిందువు బిజెపి. నిజానికి మూడు దశాబ్దాల క్రితం బోఫోర్స్ కుంభకోణం విషయంలో దేశంలోని కాంగ్రెసేతర పక్షాలన్నీ కలిసి పోరాటం చేశాయి. అప్పుడు మతతత్వం సాకు ఎవరూ చెప్పలేదు. ఈ కుంటి సాకు పేరుతో కాంగ్రెస్ కొమ్ము కాసేందుకు విపక్షాలేవీ సిద్ధం కాలేదు. ఆ పోరాట ఫలితమే విపి సింగ్ ప్రభుత్వం ఏర్పాటు. అయితే ఆ తరువాత సెక్యులరిజం పేరిట ఒక శుష్క వివాదం మొదలుపెట్టి, కాంగ్రెస్ విజయవంతంగా అవినీతి వ్యతిరేక పోరాటాన్ని నీరు గార్చేందుకు ప్రయత్నించింది. క్రమేపీ కొన్ని విపక్షాలు అవినీతి పోరాటం కన్నా కుహనా సెక్యులరిజం బండెక్కితేనే మనకు లాభం అనుకున్నాయి. తమ లబ్ధి కోసం అవసరమైతే జాతీయవాదాన్ని పణంగా పెట్టేందుకు, దేశ ప్రయోజనాలను పక్కన పెట్టేందుకు కూడా అవి సంసిద్ధమయ్యాయి.

అయితే 2014 ఎన్నికలు దేశ చరిత్రను మార్చేశాయి. సుపరిపాలన, జాతీయ వాదం, అవినీతి రాహిత్యం ఈ మూడు పునాదుల పైన నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి ఎన్నికల బరిలోకి దిగింది. ఈ ఎన్నికల్లో బిజెపి కేంద్ర బిందువు. దాని చుట్టూ మిగతా పార్టీల రాజకీయాలు జరిగాయి. బిజెపి వ్యతిరేకులందరూ పాచిపోయిన కుహనా సెక్యులరిజపు పాత పాటనే అందుకున్నారు. మతతత్వ బూచిని చూపించి పాత పద్ధతిలోనే పబ్బం గడుపుకునేందుకు పడరాని పాట్లు పడ్డాయి. చివరికి ఎన్నికల ఫలితాలు భారతీయ ఓటరు ఆలోచనా విధానమేమిటో వారికి తెలియచెప్పాయి. భారతీయ వోటరు కట్టు కథలకు, కల్లబొల్లి కబుర్లకు పడిపోడన్నది రుజువు చేశాయి. శుష్కవాగ్దానాలు, శూన్య హస్తాలను తిప్పికొట్టేందుకు భారతీయ ఓటరు సిద్ధమని నిరూపించాయి. ఎన్నికల్లో బిజెపికి పూర్తి మెజారిటీ వచ్చింది. సాహసోపేత నిర్ణయాలు తీసుకునే పూర్తి సామర్థ్యం పార్టీకి వచ్చింది.

గత మూడేళ్లలో అత్యంత సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో, దేశ భవిష్యత్తును తిరగరాసే పనులు చేయడంలో బిజెపి ప్రభుత్వం సత్తాను నిరూపించుకుంది. అంతే కాదు.. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలు

**నితీశ్ కుమార్ బీహార్‌లో బిజెపితో చేతులు కలపడం అన్నది కేవలం 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే విశ్లేషించడం సరైనది కాదు. ఇది దేశవ్యాప్త రాజకీయ ఆలోచనా విధాన రూపాంతరణకు నిదర్శనం.**

ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపించాయి. వీటన్నిటికన్నా గణనీయమైన విషయం ఏమిటంటే గత మూడేళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదు. నాయకులు ప్రజా సంక్షేమమే తమ స్వార్థంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత వచ్చింది. ప్రామాణికత పెరిగింది. ఈ మార్పును ప్రజలు గమనిస్తున్నారు. అందుకే బిజెపి వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చింది. ఈ పారదర్శక రాజకీయాలకు కేవలం రెండే ఎదురు దెబ్బలు తగిలాయి. ఒకటి ఢిల్లీ. రెండవది బీహార్. బీహార్‌లో ముఖ్యంగా కులాలు, మతాల పాత ఫార్ములాలను ఉపయోగించి బిజెపిని ఓడించడం జరిగింది. కానీ లాలూ-నితీశ్‌ల గట్‌బంధన్ ఎక్కువ కాలం కొనసాగదన్న విషయం తొలి నాటి నుంచే అందరికీ అర్థమైపోయింది. అయినా నితీశ్ కుమార్ ఈ కూటమిని రెండేళ్ల వరకూ భరించారు. కానీ లాలూ దుందుడుకు వైఖరి, అవినీతి వల్ల నితీశ్ వ్యక్తిత్వానికే మచ్చ వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే లాలూతో నితీశ్ కుమార్ తెగతెంపులు చేసుకుని, బిజెపితో కలిసి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. నితీశ్ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్టే నైతిక కారణాలూ ఉన్నాయి. ఒక వర్గం మీడియా కేవలం రాజకీయ కూడికల గురించే మాట్లాడుతున్నప్పటికీ, వాస్తవం ఏమిటంటే దేశంలోని రాజకీయ నేతృత్వం ప్రజల్లో అవినీతిని వ్యతిరేకిస్తున్నారన్నది గుర్తిస్తోంది, నితీశ్ నిర్ణయం వెనుకా ఇదే ఆలోచన ఉంది.

గుజరాత్‌లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడి బిజెపిలోకి వస్తున్నారు. వీరంతా తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారన్నది గమనార్హం. దేశంలో కొన్ని చోట్ల జరుగుతున్నట్టు ఒక పార్టీ ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా కొనసాగుతూనే మరో పార్టీకి పనిచేయడం వంటివి వీరు చేయడం లేదు. గుజరాత్‌లో మారిన వారందరూ తమ ఎమ్మెల్యే పదవులను వదులుకున్నారు. మిగతా చోట్ల కూడా ఇదే వాతావరణం కనిపిస్తోంది. నెమ్మదినెమ్మదిగా కుల, మత రాజకీయాలకు నీళ్లొదిలే రోజులు వస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం. కొందరు హ్రస్వ దృష్టితో గుజరాత్ సంఘటనలను రాజ్యసభ ఎన్నికలతో ముడిపెట్టవచ్చు గాక. కానీ అది అసమగ్ర విశ్లేషణే అవుతుంది. రాజకీయ శక్తుల పునరేకీకరణకు అవినీతి వ్యతిరేక పోరాటం పునాది అవుతోంది. మత రాజకీయాలను తిరస్కరించి, కుహనా సెక్యులరిజాన్ని తృణీకరించి ముందుకు సాగాలన్న జనాభిప్రాయానికి ఈ మార్పులు అద్దం పడుతున్నాయన్నది గమనించాలి.

నితీశ్ కుమార్ బీహార్‌లో బిజెపితో చేతులు కలపడం అన్నది కేవలం 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే విశ్లేషించడం సరైనది కాదు. ఇది దేశవ్యాప్త రాజకీయ ఆలోచనా విధాన రూపాంతరణకు నిదర్శనం. ■



జూలై 31న జరిగిన బిజెపి హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి నేతలు

# ఉత్సాహంగా జిల్లా కార్యవర్గ సమావేశాలు

రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ముగిసిన వారం రోజుల వ్యవధిలోనే జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో ఈ సమావేశాలు ఉత్సాహంగా సాగాయి. జాతీయ, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 2019 ఎన్నికలే లక్ష్యంగా వారిని కార్యోన్ముఖులను చేశారు.

● జనసందేశ్ ప్రతినిధి



ఆగస్టు 1న జరిగిన బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో కిషన్ రెడ్డి



జూలై 30న జరిగిన బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశంలో సరోజ్ పాండే



ఆగస్టు 1న జరిగిన బిజెపి పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశంలో డా॥ కె.లక్ష్మణ్



జూలై 29న జరిగిన బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో కిషన్ రెడ్డి



ఆగస్టు 3న జరిగిన బిజెపి జగిత్యాల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పి.మురళీధర్ రావు



ఆగస్టు 3న జరిగిన బిజెపి వరంగల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్ రెడ్డి



జూలై 30న జరిగిన బిజెపి జనగాం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాపారావు



జూలై 30న జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశంలో పి.సుగుణాకర్ రావు



ఆగస్టు 1న జరిగిన బిజెపి మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ప్రతి హిందువూ హిందూ దేశ చరిత్ర చదివి తీరాలి. - మహాత్మాగాంధీ

భావ పరివర్తన చాలదు, హృదయ పరివర్తన కావాలి. - శ్రీ దత్తోపంత్ ఠెంగ్డే

ఏకాత్మత

# అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలి!

● శివరాం

చైనా యుద్ధంతో దాపురించిన వెలుపలి ముప్పుతో దేశ ప్రజల్లోని ఆత్మగౌరవ భావన ఇనుమడించి, మనం ఒక్కటిగా నిలబడ్డాం!

### సమస్యలకు మూలం "స్వ" నిర్లక్ష్యం

మనం మన జాతీయ అస్తిత్వం గురించి ఆలోచించడం చాలా ముఖ్యం. ఈ అస్తిత్వం లేనప్పుడు స్వాతంత్ర్యానికి అర్థం లేదు. అది మన అభివృద్ధికి, ఆనందానికి పరికరం కాజాలదు. జాతీయ అస్తిత్వ స్పృహ లేనంత కాలం మనం మన శక్తిసామర్థ్యాలను గుర్తించ లేము, అభివృద్ధిని సాధించలేము. పరాయి పాలనలో ఈ అస్తిత్వాన్ని అణచివేస్తారు. దేశాలు సహజంగా తమ అభిరుచికి తగినట్లు అభివృద్ధి సాధించి, ఆ ప్రయత్నంలో ఆనందించాలని అనుకుంటాయి. అందు కోసమే స్వతంత్రంగా ఉండాలని అవి కోరుకుంటాయి.

ప్రకృతి శక్తివంతమైనది. దాన్ని లక్ష్యపెట్టక పోయినా, దానికి వ్యతిరేకంగా పోవాలని ప్రయత్నించినా కష్టాలు తప్పవు. సహజమైన ప్రాకృతిక ప్రవృత్తులను పట్టించు కోకుండా ఉండడం సాధ్యం కాదు. కాని ఈ ప్రకృతిని సంస్కృతి స్థాయికి వికసింప చేయవచ్చు. సహజాత ప్రాకృతిక ప్రవృత్తులను అణచి వేసిన ఫలితంగా అనేక మానసిక రుగ్మతలు దాపురిస్తాయని మానసిక శాస్త్రం చెపుతున్నది. అలాంటి వ్యక్తి అస్థిమితంతో నలిగి పోతాడు. అతని శక్తి సామర్థ్యాలు క్రమేణా క్షీణించి, దారి తప్పి పోతాడు. దేశ సహజ ప్రవృత్తులు నిర్లక్ష్యం చేయబడినప్పుడు దేశం కూడా మనిషి మాదిరే అనేక రుగ్మతలకు గురి అవుతుంది. జాతీయ అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేయడమే భారత్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూల కారణం.

### హద్దుల్లేని అవకాశవాదం

దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు మూల కారణమైన దాని గురించిన అవగాహన నేడు దేశాన్ని నడిపిస్తున్న వారిలో అధికులకు, దేశ వ్యవహారాల్లో చురుకైన పాత్రపోషిస్తున్న వారికి సైతం లేదు. దాంతో అవకాశవాదులు దేశ రాజకీయాలను నియంత్రిస్తున్నారు. మన దేశ రాజకీయాల్లో పార్టీలకు, నాయకులకు ఆశయాలు, ఆదర్శాలు, విలువలు, సిద్ధాంతాలు ప్రవర్తనా నియమావళి ఏమీ లేవు. ఒక పార్టీని వదిలిపెట్టి మరోపార్టీలోకి వెళ్ళడం నాయకులకు తప్పేమీ అనిపించడం లేదు. కేవలం ఎన్నికల్లో గెలుపు, అధికారాన్ని పంచుకోవడానికే కలవడాలు, విడిపోవడాలు జరుగుతున్నాయి. పార్టీల మధ్య పొత్తులు, పార్టీలో చీలికలు, పార్టీల కలయికలు దేనికి కూడా విలువలలో, సిద్ధాంత విభేదాలో, ఆమోదాలో కారణం కావడం లేదు.

1939లో హాఫీజ్ మహమ్మద్ ఇబ్రహిం ముస్లిం లీగ్ టిక్కెట్టు మీద ఎన్నికైనారు. ఆ తరువాత ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆరోగ్య ప్రదమైన ప్రజా ప్రవర్తన విలువలను అనుసరించి తనపదవికి రాజీనామా చేసి, మరలా కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి ఎన్నికయ్యారు. 1948లో సోషలిస్టులు కాంగ్రెస్ నుండి వెలికి వచ్చి సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వారిలో చట్టసభలో సభ్యులైన వారంతా రాజీనామా చేసి,మరలా సోషలిస్టు పార్టీ టికెట్టు మీద పోటీ చేసి సోషలిస్టు అభ్యర్థులుగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ఆరోగ్యప్రదమైన ఈ సాంప్రదాయాన్ని మర్చిపోయారు. ఇప్పుడు రాజకీయాల్లో అన్నింటికీ లైసెన్సు ఉంది. అందుకే ప్రజలకు ఎవరి మీదా విశ్వాసం లేదు. కారణాలు ఏమైనా ప్రజలు ఎవరి నిజాయితీని అయినా విశ్వసించడం కష్టం గానే ఉంది. ఈ పరిస్థితిని మార్చాలి. లేకుంటే ఐక్యత క్రమశిక్షణ సాధ్యం కాదు.

### మనదిశ ఎలాఉండాలి

దేశం నాలుగురోడ్ల కూడలిలో ఉంది. విదేశీ దురాక్రమణ కారుల దాడితో వేయి సంవత్సరాలకు పూర్వం మనం ఎక్కడ ఆగి పోయామో అక్కడినుండే మరలా మన ప్రయాణం ప్రారంభం కావాలని కొందరు అంటారు. ఒక చోట నేయడం ఆపి మరలా కొంతకాలం తరువాత అక్కడి నుండి నేత పని కొనసాగించినట్లు చేయడానికి దేశం నిర్జీవమైన వస్త్రం లాంటి వస్తువు కాదు.

అలాగే వెయ్యేండ్ల పరాయి పాలన మన జాతీయ జీవన చైతన్యాన్ని పూర్తిగా నిలువ రించిందని, ఆనాటి నుండి ఈ నాటి వరకూ మనం నిష్క్రియులమై, జడత్వంతో పడి ఉన్నామని చెప్పడం కూడా సహేతుకం కాదు. మారుతున్న కాలం విసురుతున్న సవాళ్ళను ఎదుర్కోడానికి దేశం తన మేధస్సును ఖచ్చితంగా ఉపయోగపెట్టింది. పరాయి పాలనలో స్వాతంత్ర్యం నిలుపుకోడానికి మన జీవితాన్ని ముందుకు తీసుకుపోవడానికి, మనం పోరాడాం.

మన జాతీయ జీవన చైతన్యం పూర్తిగా నిలువ రించబడలేదు. అది నిర్విరామంగా కొనసాగింది. గంగా జలాలను గడచి వచ్చిన స్థానానికి మళ్ళించాలనేది తెలివైన పని కాదు. గంగ హరిద్వార్‌లో ఉన్నంత స్వచ్ఛంగా వారణాసిలో ఉండక పోవచ్చు, ఐనప్పటికీ అది పవిత్ర గంగే. అది ఎన్నో వాగులు, వంకలు, ఉపనదులను, వ్యర్థాలను కలుపు కొని కూడా వచ్చుండవచ్చు. అయినా వాటికి వేటికీ ప్రత్యేకమైన అస్తిత్వం లేదు. అవి కూడా గంగే అయిపోతాయి. ఈ ప్రస్తుత గంగే ప్రకాశవంతమై ముందుకు సాగాలి. ఇది సంభవమైతే పెద్ద సమస్య ఏదీ ఉండదు.

అయితే ప్రపంచంలో ఇతర దేశాలు కూడా ఉన్నాయి. గడచిన వేయి సంవత్సరాల్లో ప్రపంచ దేశాలు అసాధారణమైన పురోగతిని సాధించాయి. ఆ సమయంలో దురాక్రమణ దారులను అడ్డుకోవడం, స్వాతంత్ర్యంకోసం పోరాడ్డం మీదనే మనం దృష్టి పెట్టాల్సి వచ్చింది. అందువల్ల ప్రపంచ పురోగతికి మన తోడ్పాటును అందించలేక పోయాం. ఇప్పుడు మనం స్వతంత్రుల మైనాం. వీలున్నంత త్వరలో గతలోటును పూడ్చి పురోగమిస్తున్న మిగతా ప్రపంచ దేశాలతో భుజం భుజం కలిపి నిలవడం మనకు అత్యంత ముఖ్యం కాదా!

**వ్యాఖ్య:** 1965లో దీనదయాళ్జీ వెల్లడించిన ఆకాంక్ష 1998లో ఆటల్జీ పాలనలో ఆరంభమై, నేటికి మోదీ పాలనలో పూర్తిగా సాకారమైంది. ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద

సంస్మరణ

# స్ఫూర్తిదాయకంగా కుషాభావ్ ఠాక్రే జీవితం

**(ఆగస్టు 15న బిజెపి మాజీ అధ్యక్షుడు కుషాభావ్ ఠాక్రే జయంతి సందర్భంగా జనసందేశ్ పాఠకుల కోసం)**



కుషాభావ్ ఠాక్రే 1922 ఆగస్టు 15న మధ్యప్రదేశ్‌లో సుందర రావు శ్రీపతి రావు ఠాక్రే, శాంతా బాయి సుందరరావు ఠాక్రే దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ధార్, గ్వాలియర్‌లో కొనసాగింది. 1942లో ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చేరారు. ఆ తర్వాత రత్లాం డివిజన్ (రత్లాం, ఉజ్జయిన్, మండసర్, జబువ, చిత్తూర్, కోట, బుండి, జలవాద్, బాన్స్‌వాడ (రాజస్థాన్), దహోడ్ (గుజరాత్) వెళ్లారు. కుషాభావ్ ఠాక్రే ఇప్పటికీ వేలాది మంది బిజెపి కార్యకర్తలకు మార్గదర్శిగా ఉన్నారు. ఆయన నుంచి స్ఫూర్తి పొంది జాతి నిర్మాణానికి అంకితమయ్యారు. ఆయన నిజమైన కార్యకర్త. ఉన్నత పదవులు అలంకరించినా ఎప్పుడూ కార్యకర్తలతో సంబంధం కొనసాగించే వారు. పార్టీకి, పార్టీ సిద్ధాంతానికి ఎప్పుడూ నిబద్ధమై ఉన్నారు.

**ఆర్ఎస్ఎస్-జనసంఘ్:** కుషాభావ్ ఠాక్రేకు 1942 నుంచి ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉంది. నీముంచ్ (మధ్య ప్రదేశ్)లో ప్రచారక్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రాట్లాం డివిజన్ (రాజస్థాన్‌లోని రాట్లాం, ఉజ్జయిన్, మండసర్, జబువ, చిత్తూర్, కోట, బుండి, జలవాద్, బాన్స్‌వాడ డివిజన్లు), గుజరాత్‌లోని దాహోడ్‌లలో పనిచేశారు.

**భారతీయ జనసంఘ్‌లో ఠాక్రే ప్రస్థానం**

**1956:** పార్టీ ఆరంభం నుంచి సంఘటనా కార్యదర్శి (మధ్య ప్రదేశ్)

**1967:** అఖిల భారత కార్యదర్శి, భారతీయ జనసంఘ్, ఒరిస్సా (గుజరాత్ అదనపు ఇంచార్జిగా బాధ్యతలు)

**1974:** అఖిల భారత కార్యదర్శి (సంఘటన)

**1979:** మధ్యప్రదేశ్‌లోని ఖండ్వ నుంచి ఉపఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.

**1980:** బిజెపి అఖిల భారత కార్యదర్శిగా నియామకం. గుజరాత్, ఒరిస్సా, మధ్య ప్రదేశ్ పార్టీ వ్యవహారాల బాధ్యత. 1984 వరకు అదే పదవిలో కొనసాగారు.

**1984-86 :** బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు

**1986-91:** జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్య ప్రదేశ్ ఇంచార్జి

**1991-93:** జాతీయ ఉపాధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ ఇంచార్జి

**1993:** జాతీయ ప్రధాన కార్యదర్శి (సంఘటన), మధ్య ప్రదేశ్ ఇంచార్జి

**1998-2000:** బిజెపి జాతీయ అధ్యక్షుడు

**2003, డిసెంబర్ 28న** అస్తమించారు.

## గమనిక

పాఠకుల సౌలభ్యం కోసం జనసందేశ్ పక్ష పత్రిక ఈ-మ్యాగజైన్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చింది. http://www.bjptelangana.org/ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి జనసందేశ్(ఈ-బుక్) ట్యాబ్‌ను ప్రెస్ చేస్తే గత 10 సంచికలకు సంబంధించిన తేదీలు కనిపిస్తాయి. కావాల్సిన సంచికను ఎంచుకొని క్లిక్ చేస్తే ఈ-మ్యాగజైన్ తెరుచుకుంటుంది. అవసరమైతే పాఠకులు ఈ ఈ-మ్యాగజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తర్వాత కూడా చదువుకోచ్చు.

-ఎడిటర్

స్ఫూర్తి

# లక్ష్యాలలో సామ్యం, మార్గాలలో భిన్నత్వం



(1962 జనవరి 15 ఆర్గనైజర్ సంచిక సౌజన్యంతో)

• పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ

ఆర్థిక విధానాల విషయంలో వివిధ రాజకీయ పార్టీల లక్ష్యాల మధ్య పెద్ద తేడా లేదు. అన్ని రాజకీయ పార్టీలు ప్రజల జీవన విధానాన్ని పెంపొందిచాలనే అనుకుంటాయి. అసమానతలను తొలగించాలనే అనుకుంటాయి. అయితే ఈ లక్ష్యాలు సాధించడంలో మాత్రం తేడాలు ఉన్నాయి. అసమానతలు తగ్గించడంలో తేడాలు ఉన్నాయి. సోషలిస్టు పార్టీలు ఆర్థిక విధానాలలో ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారా ఈ లక్ష్యం సాధించాలనుకుంటాయి. సోషలిస్టు పార్టీలు రాజ్య వ్యవస్థ భాగస్వామ్యంతో సాధించాలనుకుంటే సోషలిస్టుయేతర పార్టీలు వ్యక్తి సృజనాత్మకత ఆధారంగా ఈ లక్ష్యం సాధించాలనుకుంటాయి. అయితే ఇది సామాజిక అవసరాలకు అనుగుణంగా ఉండాలి. అధికార కేంద్రీకరణకు దారి తీయకుండా ఉండాలి.

### కాంగ్రెస్

సోషలిస్టు రాజ్యంపై కాంగ్రెస్ వైఖరిని వివరిస్తూ తమ ప్రణాళికలో కాంగ్రెస్ ఇలా చెప్పింది.. "ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం ఒక్కటే భారత్ సమస్య కాదు. అంతకంతకూ సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని కూడా పెంపొందించాలి. ప్రస్తుతం సమాజంలో ఉన్న అసమానతలు, వ్యత్యాసాలు నైతికంగా దోషపూరితమైనవి. ఇవి అన్ని రంగాలలో అభివృద్ధిని కుంటుపరుస్తాయి. విద్వేషాలను ప్రేరేపిస్తాయి. ఈ లక్ష్యాన్ని సాధించడం సోషలిస్టు, సహకార విధానంలోనే సాధ్యం."

### పి.ఎస్.పి., సి.పి.ఐ.

సమానత్వ అవకాశాన్ని నొక్కి చెప్తూ ప్రజా సోషలిస్టు పార్టీ (పి.ఎస్.పి.) ఇలా తెలియజేసింది. "స్వేచ్ఛ అన్న అంశం భారత్‌లో సమానత్వం కోసం పోరాటం ద్వారానే వ్యక్తం అవుతుందని ప్రజా సోషలిస్టు పార్టీ భావిస్తోంది. పి.ఎస్.పి. చేసే పోరాటాలన్ని అన్ని రకాల వర్గ విభేదాలకు వ్యతిరేకమైనవే. అవి ఆర్థిక పరిస్థితికి, సామాజిక స్థాయికి, సాంస్కృతిక ప్రయోజనాలకు సంబంధించినవి కావచ్చు." మరో పారాగ్రాఫ్‌లో ఆ పార్టీ ఇలా చెప్పింది. "ప్రజా సోషలిస్టు పార్టీకి ప్రస్తుత వ్యవస్థను సవాలు చేసే సోషలిస్టు వ్యవస్థలో అపారమైన విశ్వాసం ఉంది. దాని స్థానంలో సమానత్వం ఉండే వ్యవస్థ ఉండాలని ఆకాంక్షిస్తుంది. ఆదాయాలలో, సమాజాన్ని నడిపే అంశాలలో ప్రజల ఆధిపత్యంలో సమానత్వం ఉండాలని కోరుతుంది. దేశంలోని ప్రతి పౌరుడు అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉండాలని, వ్యక్తిలోని సృజనాత్మకతకు వీలుండాలని కాంక్షిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో తన లక్ష్యాన్ని నిర్వచించనూ లేదు, సోషలిజంలో తన విశ్వాసాన్ని పునరుద్ఘాటించనూ లేదు. వారి స్వభావం అందరికీ తెలిసిందే కనక మళ్లీ పునరావృతం చేయవలసిన అవసరం లేదు.

### భారతీయ జనసంఘ్ వైఖరి

భారతీయ జనసంఘ్ సోషలిజానికి గానీ, పెట్టుబడిదారీ విధానానికి గానీ కట్టుబడదు. అందువల్ల ప్రజల ఆర్థిక సమస్యలకు పరిష్కారం కనుగొనే విషయంలో తాత్విక వైఖరిని అనుసరించదు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాన్ని రద్దు చేయాలని కోరుతుంది. ప్రజల అవసరాలు, దేశ రక్షణ అవసరాలు తీరడానికి ఉత్పత్తి పెరగాలి. అయితే ఉత్పత్తికి సంబంధించిన కార్యక్రమాలు ఆర్థిక శక్తి కేంద్రీకృతం కాకుండా, ఇప్పుడున్న అసమానతలు మరింత పెరగకుండా ఉండాలి. అసమానతలు పరిమిత మార్కెట్లకు దారి తీస్తాయి. తద్వారా ఉత్పత్తి, ఉపాధి తగ్గుతాయి. అందరికీ పని చేసుకునే అవకాశాలు కల్పిస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వస్తు, సేవలు అందించే వారికి తగిన ప్రతిఫలం దక్కితే సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు సరిదిద్దవచ్చు. ఉత్పాదకత పెరగడం, అట్టడుగువర్గాల వారికి వేతనాలు పెరగడం వల్ల దానంతట అదే ఇతరులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పెట్టుబడి సమకూరాలనుకుంటే అది జాతీయ కనీస ఆదాయం కన్నా ఎక్కువ ఉన్న వారి ద్వారా అది జరగాలి.

కార్మికులకు తగిన వేతనాలు ఇవ్వకుండా పెట్టుబడి సమకూరిస్తే పరిశ్రమలకు మార్కెట్ లేకుండా పోతుంది. దాని వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. అందువల్ల భారతీయ జనసంఘ్ కనీస జీవన ప్రమాణానికి కావాల్సిన ఏర్పాటు ఉండాలని, పంపిణీలో సమానత్వం ఉండాలని, అందరికీ ఉపాధి ఉండాలని తన లక్ష్యాలుగా నిర్దేశించుకుంది.

### ప్రణాళిక పట్ల మౌలిక వైఖరులు

దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికా విధానం ఉండాలని అంగీకరిస్తాయి. ప్రస్తుత ప్రణాళికా విధానం పట్ల కాంగ్రెస్ సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రణాళికల అవసరం, ప్రస్తుతం అమలులో ఉన్న రాజ్యాంగ స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని జనసంఘ్ ప్రణాళిక సంఘం ఏర్పాటులో, జాతీయ అభివృద్ధి మండలిలో మార్పులు చేయాలని ఎన్నికల ప్రణాళికలో కోరింది. "భారతీయ జనసంఘ్ ప్రణాళికా సంఘాన్ని, జాతీయ అభివృద్ధి మండలిని పునర్వ్యవస్థీకరిస్తుంది. ప్రణాళికా సంఘాన్ని నిపుణులకు నెలవుగా మారుస్తుంది. రాజకీయ శక్తులకు అవకాశం లేకుండా చేస్తుంది. జాతీయ అభివృద్ధి మండలిలో కేంద్ర మంత్రివర్గ సభ్యులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దామాషా ప్రకారం పార్లమెంటు సభ్యులు, రాష్ట్రాల శాసన సభ్యులు ఉంటారు" అని జనసంఘ్ ఎన్నికల ప్రణాళికలో తెలియజేసింది.

ఈ పద్ధతిలో ఈ రెండు వ్యవస్థలను పునర్వ్యవస్థీకరిస్తే వాటికి ఇప్పుడున్న పక్షపాత ధోరణి పోయి అవి నిజంగా జాతీయ లక్షణాన్ని సంతరించుకుంటాయి. ఈ అవసరాన్ని గుర్తించి ప్రధానమంత్రి అఖిల పక్ష సంఘాన్ని ఏర్పాటు చేశారు. కాని ఈ సంఘం సమర్థంగా పని చేయలేక పోయింది. ప్రణాళికా విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ అంచనాల కమిటీ ఒక నివేదికలో తెలియజేసింది. ప్రణాళికా యంత్రాంగం గురించి కమ్యూనిస్టు పార్టీ ఏమీ చెప్పలేదు కాని పి.ఎస్.పి. మాత్రం "ఆర్థిక ప్రణాళికలో ప్రజాస్వామ్య బద్ధమైన జిల్లా పరిపాలనా యంత్రాంగానికి స్థానం ఉండాలి" అని చెప్పింది. ఇందులో ఒక మతలబు ఉంది. పి.ఎస్.పి. అభిప్రాయం ప్రకారం భూ సంస్కరణలను జిల్లా స్థాయి కమిటీలకు అప్పగించాలి. కాని ప్రణాళిక అంటే భూ సంస్కరణలు ఒక్కటే కాదన్న వాస్తవాన్ని ఆ పార్టీ విస్మరించింది. ■

# శరవేగంగా జాతీయ రహదారుల విస్తరణ

కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ 2017-18 ఆర్థిక సంవత్సరంలో 15,000 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించాలన్న బృహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా జూన్ 30 నాటికి ఇప్పటికే 2,269 కిమీల రహదారుల నిర్మాణాన్ని పూర్తిచేసింది. గత మూడేళ్ళలో జాతీయ రహదారుల నిర్మాణ వేగం గణనీయంగా పెరిగింది.

రోడ్డు ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయడానికి ప్రాజెక్టు డెవలపర్లు, కాంట్రాక్టర్లు, రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు కేంద్రం సమావేశాలు నిర్వహిస్తోంది. నిర్మాణం సాఫీగా, ఒడుదుడుకులు లేకుండా సాగేందుకు మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు తన ప్రాంతీయ అధికారులు, నిర్మాణ కంపెనీలు, కాంట్రాక్టర్లతో సంప్రదింపులు జరుపుతోంది. భూసేకరణను త్వరితం చేయడం, పర్యావరణ అనుమతులను వేగవంతం చేయడం, ఈక్విటీ మదుపుదారులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వైదొలగేందుకు వీలు కల్పించడం, ఇతర మంత్రిత్వ శాఖలతో సన్నిహిత సమన్వయం, వివాద పరిష్కార వ్యవస్థలను పటిష్టం చేయడం, తరచుగా సమీక్షల నిర్వహణ వంటి చర్యల ద్వారా కేంద్రం రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులను శరవేగంతో పూర్తి చేస్తోంది.

ఇదిలా ఉండగా, 51,300 రాష్ట్ర హైవేలను జాతీయ రహదారులు గా

| S No | Year | Length completed (KM) | Rate of construction (KM Per Day) |
|---|---|---|---|
| 1 | 2014-15 | 4410 | 12.08 |
| 2 | 2015-16 | 6061 | 16.60 |
| 3 | 2016-17 | 8231 | 22.55 |
| 4 | 2017-18 (up to 30th June) | 2269 | 25.21 |




మార్చాలని కేంద్రం నిర్ణయించింది. రోడ్డు రవాణా, హైవేలు, నౌకా రవాణా మంత్రి పి.రాధాకృష్ణ జూలై 20న లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయం చెప్పారు. సవివర ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్‌లు), అనుసంధాన ప్రాధాన్యాలు, నిధుల లభ్యత ఆధారంగా ఈ మార్పును చేపడతారు.

2014 మార్చి నాటికి దేశంలో మొత్తం 91,287 కిమీల జాతీయ రహదారులు ఉండగా ప్రస్తుతం వాటి పొడవు 1,15,435 కిమీలకు పెరిగింది. సరిహద్దు ప్రాంతాలకు, చిన్న ఓడరేవులతో సహా తీర ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, జాతీయ కారిడార్లు, ఆర్థిక కారిడార్ల అభివృద్ధి మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకుని రవాణా సదుపాయాలను మరింత పెంచడానికి ప్రభుత్వం జాతీయ రహదారుల వ్యవస్థను సమగ్రంగా సమీక్షించింది.

# లక్ష్య సాధన దిశగా స్వచ్ఛ భారత్

స్వచ్ఛ భారత్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. 2019 అక్టోబర్ 2 లోగా లక్ష్య సాధన దిశగా సాగుతున్నాయి. 2014 అక్టోబర్ 10 నాటికి 41.80 శాతానికి పారిశుధ్య సదుపాయం ఉంటే 2017 జులై 17 నాటికి అది 65.07 శాతానికి చేరిందని కేంద్ర మంచినీటి వనరులు, పారిశుధ్య శాఖ మంత్రి చందప్ప జిగ్జినాగి జూలై 20న లోక్‌సభలో తెలియజేశారు. 2,09,099 గ్రామాలు, 95,521 గ్రామ పంచాయితీలు, 1,411 బ్లాకులు, 149 జిల్లాలు బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన నుంచి విముక్తమయ్యాయని మంత్రి తెలియజేశారు. సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఉత్తరాఖండ్, హర్యానా రాష్ట్రాలు పూర్తిగా బహిరంగ మలవిసర్జన నుంచి విముక్తమయ్యాయి. 2014-15లో 50లక్షల మరుగుదొడ్లు నిర్మించాలనుకుంటే 58, 54,987 మరుగుదొడ్లు నిర్మించారు. ఇది లక్ష్యానికి మించి 117 శాతం అధికం. 2015-16లో 120 లక్షల మరుగుదొడ్లు నిర్మించాలనుకుంటే 127.41 లక్షల మరుగుదొడ్లు నిర్మించారు. 2016-17లో కోటిన్నర




మరుగుదొడ్లు నిర్మించాలనుకుంటే ఇంతవరకు 219.24 లక్షల మరుగుదొడ్లు నిర్మించారు. అంటే 146 శాతం నిర్మించారు. 2017-18లో 1.7 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 45,19,942 నిర్మించారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని 2019 అక్టోబర్ నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.




# మూక హింసపై తప్పుడు ప్రచారాలు



**వసుంధర రాజే**
రాజస్థాన్ ముఖ్యమంత్రి

కేంద్ర ప్రభుత్వం, బిజెపి ప్రోత్సాహంతోనే దేశంలో మూక న్యాయం అమలు జరుగుతోందని, గో రక్షకుల పేరిట అరాచకాలు, కొట్టి చంపడాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఒక వర్గం మీడియాలో గత ఏడాదిన్నర కాలంగా బలంగా జరుగుతోంది. మతం, కులం, లేదా ఆహారపుటలవాట్ల కారణంగా ఎవరైనా, ఏ రాజకీయ పార్టీ అయినా మూకన్యాయాన్ని ప్రోత్సహిస్తుందనడం నా ఉద్దేశంలో కేవలం ద్వేషంతో కూడిన ఆరోపణే. ఇది నిజాయితీ రాహిత్యం కూడా. మా రాష్ట్రం (రాజస్థాన్)లో మూడు అంశాల ఆధారంగా నేను ఈ నిర్ధారణ చేస్తున్నాను. ఒకటి ఆరోపణలు–నేర నిర్ధారణ, కథనం–సమాచారం, వ్యక్తిగత ప్రేరణ–గుంపు మనస్తత్వం

ఇందులో మొదటి అంశం 'ఆరోపణ–నేర నిర్ధారణ'ను తీసుకుందాం. 'నేరం రుజువయ్యేవరకు ఎవరైనా నిర్దోషులే', హెబియస్ కార్పస్ (అక్రమ నిర్బంధం నుంచి రక్షణ) అనేవి న్యాయశాస్త్రంలో రెండు ముఖ్య సూత్రాలు. హింస ఎక్కడ జరిగినా ప్రత్యక్ష సాక్షులు, హింసకు పాల్పడిన వారు, బాధితుల కథనాలు భిన్నంగా ఉంటాయి. అన్ని పక్షాల ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని, దర్యాప్తు చేసి కోర్టుకు కేసును సమర్పించడంలోనే పోలీసుల పనితనం ఇమిడి ఉంటుంది. ఆరోపణలు ఎప్పుడూ నేర నిర్ధారణలు కావు.

ప్రతాప్‌గడ్‌లో బహిరంగ మల విసర్జనపై చెలరేగిన వివాదంలో జాఫర్ ఖాన్ అనే వ్యక్తి మృతి చెందిన దురదృష్టకర సంఘటన విషయానికొస్తే ఎక్కడ, ఎప్పుడు, ఎలా అనే దానిపై భిన్న కథనాలు ఉన్నాయి. అతని మృతిపై దర్యాప్తు జరుగుతోంది. ఎవరైనా దోషులని తేలితే వారిపై నేరాభియోగం మోపి, నేరాన్ని నిర్ధారించి జైలుకు పంపుతారు. అదేవిధంగా పెహ్లు ఖాన్ సంఘటనలో కూడా ఏడుగురు నిందితులపై కేసులు దాఖలయ్యాయి. వారి నేరం నిర్ధారణ అయితే వారికీ జైలు తప్పదు.

ఇక రెండో అంశం, ప్రచారంలోకి వచ్చే కథనాలు వాస్తవాల కంటే బలంగా ఉంటాయి. ఇది మానవ నైజం. ప్రతి అసహజ మరణమూ నివారించదగిన విషాదమే అయినప్పటికీ హింసా ప్రవృత్తి మానవ స్వభావంలో ఒక భాగం అన్నది బాధించే వాస్తవం. గత మూడేళ్ళ కాలంలో రాజస్థాన్‌లో కానీ, దేశంలో కాని మరణాల సంఖ్య, మతపరమైన మూక హింస సంఘటనల సంఖ్యలో మార్పేమీ లేదు (నిజానికి 2012తో పోలిస్తే 2017లో హత్యలు, మూక హింస సంఘటనల సంఖ్యా తగ్గింది). దురదృష్టవశాత్తూ దేశంలో ప్రతిరోజూ సహజ, అసహజ కారణాలతో రోజూ 22,500 మంది చనిపోతుంటారు. నాకు తెలిసిన ప్రతి రాజకీయ నేత మెరుగైన ఆరోగ్య, వైద్య సౌకర్యాల ద్వారా సహజ మరణాలను, పోలీసు సంస్కరణలు, సామాజిక పరివర్తన ద్వారా అసహజ మరణాలను తగ్గించాలని కలలు కంటారు.

ఇక మూడో అంశం వ్యక్తిగత ప్రేరణ–మూక మనస్తత్వం. మనుషులు బీటలు వారిన పాత్రల వంటి వారు. విభేదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకునే లక్షణం మనకు లేదు. వ్యక్తుల్లో జాతి, కులం, మతం లేదా లింగపరమైన రాగద్వేషాలు గూడు కట్టుకుని ఉంటాయి. కానీ వ్యక్తుల లక్షణాలను మొత్తం సమూహానికి ఆపాదించడం లేదా అంటగట్టడం, ఉదాహరణకు రాజస్థాని మగవాళ్ళంతా పురుష దురహంకారులు, బిజెపి సభ్యులు ఎవరికీ మతసహనం లేదు వంటి భావాలు ప్రచారం చేయడం అన్యాయం, అశాస్త్రీయం.

సంతోషంగా జీవించే కుటుంబాలన్నీ ఒకలాగే ఉంటాయని, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మాత్రం ఒకో కుటుంబానికి ఒకోరకమైన కష్టం ఉంటుందని లియో టోల్‌స్టోయ్ రాశాడు. చాలావరకు మూక హింసకు సంబంధించిన సంఘటనలు వ్యక్తిగత ప్రేరణలు, తక్షణ పరిస్థితులు, పోలీసుల జాప్యం వంటి అనేక అంశాల మిశ్రమం. మితవాదులు ఎక్కువ హింసాత్మకమా, అతివాద వామపక్షాలు ఎక్కువ హింసాత్మకమా అని చర్చించడం సిగ్గుచేటు. అలాగే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మితవాద వర్గాల హింసను చూసీ చూడనట్టు పోతాయని ఆరోపించడం తప్పుడు ప్రచారం. దేనికైనా వ్యక్తులే పూర్తి బాధ్యత వహించాలి తప్ప వ్యక్తులు చేసిన పనులను మొత్తం వర్గాలకు, బృందాలకు ఆపాదించడం వల్ల ఉపయోగం లేదు.

మూక హింస సంఘటనలన్నీ చట్ట విరుద్ధమేనని, వాటికి పాల్పడిన వాళ్ళు చట్టం ప్రకారం పర్యవసానాలను అనుభవించాల్సిందేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక సందర్భాల్లో ఉద్ఘాటించారు. ఒక ముఖ్యమంత్రిగా తరచుగా నేను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పరిస్థితులను చర్చిస్తుంటాను. మనం ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను సమర్థించకూడదని, రాజ్యాంగమే అత్యున్నతమని, కులం, మతం, ప్రాంతం, లింగ విభేదాలకు అతీతంగా పౌరులందరూ చట్టం ముందు సమానులేనని మేమంతా ఏకాభిప్రాయంతో ఉన్నాం.

ఏదైనా రాజకీయ పార్టీ లేదా నాయకుడు మూక హింసను సమర్థిస్తున్నారని అనేవారు నా దృష్టిలో బిజెపిని ద్వేషించే వారైనా (బిజెపి జాతీయ వాదం, దేశభక్తి ఇతర మతాలను, వర్గాలను సహించదని వారి బలమైన నమ్మకం) అయివుండాలి లేదా నిజాయితీ లేని వారు కాని (వారిదృష్టిలో వాస్తవాల కంటే తమకు అనుకూలమైన కట్టుకథలే ముఖ్యమైనవి) అయి ఉండాలని నా అభిప్రాయం. ఇక్కడ బాధితుల కుటుంబాలకు న్యాయం జరగాలి. మన నేర పరిశోధన వ్యవస్థను నిష్పక్షపాతంగా, వేగంగా, సమర్థంగా పనిచేసేదిగా చేయడడానికి మనం మరింతగా కృషి చేయాలి.

2014 తరువాత దేశంలో అన్నిరంగాలకు సంబంధించి ప్రమాణాలు పెరిగాయి. ఆయు ప్రమాణం, అక్షరాస్యత, పిల్లల మరణాల సంఖ్యలో తగ్గుదల, ద్రవ్యోల్బణం, పరిశుభ్రత, ఆర్థిక వ్యవస్థలో ప్రజల అనుసంధానం, కరెన్సీ విలువ, హింసాత్మక మరణాలు... వీటన్నిటి విషయంలో పరిస్థితి మెరుగుపడింది. హింసాత్మక సంఘటనల్లో తగ్గుదల ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న పరిణామం.

రాజస్థాన్‌లో అసలు మూక హింస హత్యలు అసలు లేనే లేవని నేను అనడం లేదు. అయితే వాటిని అసలు లేకుండా చేయాలన్నది రాజస్థాన్, మొత్తం భారత్ లక్ష్యంగా ఉండాలని నేను భావిస్తున్నాను. మా లక్ష్యానికి, వాస్తవ పరిస్థితికి మధ్య అంతరం ఒక అబద్ధం కాదు, నిరాశ కలిగించే విషయం మాత్రమే. ఈ అంతరాన్ని మన జీవితకాలంలో రాజకీయ నాయకులు తొలగించలేక పోవచ్చు, కాని చివరి శ్వాస వరకు ప్రయత్నిస్తూనే ఉంటాం. ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద




# పథకాల అమలు ముఖ్యం



**రవి శంకర్ ప్రసాద్**
కేంద్ర ఐటి, న్యాయ శాఖ మంత్రి

నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏదైనా కొత్త పథకాన్ని ప్రారంభించినప్పుడల్లా "ఈ పథకాన్ని మేమే ప్రారంభించాం, మేము మొదలుపెట్టినదాన్ని మాత్రమే మోదీ కొనసాగిస్తున్నారు." అనడం కాంగ్రెస్‌కు పరిపాటిగా మారింది. అన్ని ప్రభుత్వాల మౌలిక బాధ్యతలు ఒక్కటే అని గ్రహించలేక కాంగ్రెస్ తననుతాను అపహాస్యం చేసుకుంటోంది. మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన మొదలైనవి ప్రభుత్వాల బాధ్యత. రోడ్లు వేయడంపై ఏ పార్టీకి ట్రేడ్ మార్కులు, ప్రత్యేక హక్కులూ లేవు. పాఠశాలలు నిర్మించాల్సిన అవసరం ఉన్న సమయంలో కొత్తదనం కోసం ఎవరూ అంతరిక్ష నౌకలు నిర్మించరు.

కాంగ్రెస్ ప్రభుత్వాలకు లేనిది, మోదీ ప్రభుత్వానికి ఉన్నది ఏమిటంటే కొత్తగా ఆలోచించడం, నవకల్పనకు పెద్దపీట వేయడం, పథకాలను సమర్థంగా అమలుచేయడం. ఏసీ గదుల్లో కూర్చుని ఆలోచించినప్పుడు అసాధ్యంగా కనిపించిన పథకాలు అమలులో సుసాధ్యంగా కనిపిస్తాయి. దీనికి ఉదాహరణ ముద్రా యోజన. అలాగే ఇన్నాళ్ళూ ప్రభుత్వాలు అసలు పట్టించుకోని రంగాలు నేడు కొత్త జవసత్వాలు పుంజుకున్నాయి. దీనికి స్వచ్ఛ భారతే ఉదాహరణ. ఈ పథకాలు సమర్థంగా, లోపరహితంగా అమలవుతున్నాయి.

కాంగ్రెస్ ధోరణి ఎలా ఉందంటే దేశంలో ప్రతి ఒక్కరూ బ్యాటింగ్ చేయగలరు, సచిన్ టెండూల్కర్ ప్రత్యేకత ఏముంది? అని అడిగినట్టు ఉంది. మిగతా వారిలాగే సచిన్ కూడా అదే బ్యాటుతో, అదే పిచ్‌పై బ్యాటింగ్ చేస్తాడు. అలాగే ప్రభుత్వాలు కూడా ఒకే నిబంధనల ప్రకారం, ఒకే పరిస్థితుల్లో తమ విధులు నిర్వహిస్తాయి. కానీ తేడా ఎక్కడ ఉంటుందంటే పనిలో నాణ్యత, కొత్త ఆలోచనా విధానం, అమలు చేసే పద్ధతి, అంతిమ ఫలితాలు. కేవలం మూడేళ్ళలో మోదీ ప్రభుత్వం 13.5 కోట్ల మందికి, అంటే దాదాపు రష్యా జనాభాకు సమానంగా సామాజిక భద్రత కల్పించింది. 28 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిపించింది. ఇది అమెరికా జనాభా కంటే కొంచెం తక్కువ. ఏడు కోట్ల మంది చిన్న వ్యాపారులకు హామీ లేని రుణాలు అందచేసింది. ఈ సంఖ్య బ్రిటన్ జనాభా కంటే ఎక్కువ. ఐదు కోట్ల కుటుంబాలకు, అంటే స్పెయిన్ జనాభాతో సమానంగా వంట గ్యాస్ సౌకర్యం కల్పించింది.

ఇక ఇప్పుడు మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పథకాలనే కొనసాగిస్తున్నారు అన్న ఆరోపణకు వద్దాం. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వివిధ ఉపాధి హామీ పథకాలను అమలు చేస్తున్నాయి. భారత్‌లో కూడా చాలాకాలంగా అటువంటి పథకం ఒకటి నడుస్తోంది. ఈ తరహా పథకాల్లో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం మొదటిదీ కాదు, చివరిదీ కాదు. మొదటగా 1972లో మహారాష్ట్రలో 'ఉపాధి హామీ పథకం' పేరిట ఇటువంటి పథకాన్ని అమలుచేశారు. 1977లో 'ఉపాధి హామీ చట్టం, 1977' పేరిట దీనికి చట్ట రూపం కూడా ఇచ్చారు. ఆ తరువాత 'జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం', ఏడాదికి 100 రోజుల ఉపాధి హామీతో 'భూమి లేని గ్రామీణ నిరుపేదల ఉపాధి హామీ కార్యక్రమం', జవహర్ రోజ్‌గార్ యోజన, సంపూర్ణ గ్రామీణ్ రోజ్‌గార్ యోజన, జాతీయ పనికి ఆహార పథకం వగైరా పథకాలు అమలయ్యాయి. కానీ మా ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని లోపాలను సరిదిద్దుతూ అనేక మార్పులు చేసింది. శాశ్వత, ఉత్పాదక ఆస్తుల సృష్టి జరుగుతోంది. నిధుల దుర్వినియోగం చాలావరకు తగ్గిపోయింది, కార్మికులకు వేతనాలు సకాలంలో అందుతున్నాయి, గతంలో కంటే ఎక్కువ పనులు జరుగుతున్నాయి, వేతనాలు నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి.

ఆధార్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. దీన్ని యూపీఏ మొదలుపెట్టనూ లేదు, పూర్తి చేయనూ లేదు. 2001లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఒక మంత్రుల బృందం బహుళ ప్రయోజన గుర్తింపు కార్డుపై ఒక నివేదికను సమర్పించింది. 2003లో లోక్‌సభలో ఎన్డీఏ ప్రభుత్వం పౌరసత్వ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టింది. ఇందులో "కేంద్ర ప్రభుత్వం ప్రతి భారత పౌరుడి వివరాలనూ నమోదు చేసి జాతీయ గుర్తింపు కార్డును జారీ చేయవచ్చు," అనే నిబంధన కూడా ఉంది. 2004లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మొదటి ఐదేళ్ళ పాటు ఈ విషయంలో ఏమీ చేయలేదు. చివరికి 2009లో ఆ ప్రభుత్వం ఆధార్ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. దానికి 'ఆధార్' అని పేరుపెట్టి లోగోను విడుదల చేయడానికి మరో ఏడాది పట్టింది. అయినా 'మా కార్యక్రమాన్ని కాపీ కొట్టారు' అని బిజెపి ఎప్పుడైనా కాంగ్రెస్‌ను ఎత్తిపొడిచిందా?

ఆధార్ విషయంలో యూపీఏ ప్రభుత్వానికి ఒక స్పష్టమైన అవగాహన, చిత్తశుద్ధి లేకపోయాయి. వారి దృష్టిలో దానికదే ఒక పథకం, అంతే. దానికి పార్లమెంటు ఆమోదముద్ర వేయించడానికి కూడా వారు ఐదేళ్ళలో ప్రయత్నం చేయలేదు. ఆధార్ ప్రయోజనాలపై ప్రభుత్వ శాఖల్లో అవగాహన లేదు. అందుకు భిన్నంగా మా ప్రభుత్వం ప్రజలకు వస్తువులు, సేవలు అందించడంలో ఆధార్‌ను కీలకం చేసింది. 100కు పైగా పథకాల అమలులో నేడు ఆధార్ అంతర్భాగం. ఆధార్‌తో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మోదీ ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా ప్రభుత్వ ఖజానాకు ఈ మూడేళ్ళలో రూ.50,000 కోట్లు ఆదా అయ్యాయి.


కాంగ్రెస్, కొంతమంది విశ్లేషకులు ఉద్దేశపూర్వకంగా 'ఎన్డీఏ ప్రభుత్వం పాత పథకాలనే కొనసాగిస్తోంది' అని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం ఫలితాలకు ప్రాధాన్యమిస్తుంది తప్ప రిబ్బన్ కత్తిరించే కార్యక్రమాలకు, ప్రచార ఆర్భాటాలకు కాదు. మా ప్రభుత్వం ప్రారంభించిన పథకాలన్నీ వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించిన నవకల్పనాత్మక పథకాలే. అవి పడక్కుర్చీ మేధావుల ఊహాజనిత సిద్ధాంతాల నుంచి పుట్టినవి కాదు, దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వినూత్న అవగాహన, ఆలోచనలతో రూపొందిన పథకాలు.

ప్రారంభించిన ప్రతి పథకం అమలుపై మా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంది. వాటి అమలును పరిశీలిస్తూ లోపాలను వెంటనే సవరిస్తుంది. జన్‌ధన్ యోజన, ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ఫసల్ బీమా యోజన, స్వచ్ఛ భారత్‌లు ఇందుకు కొన్ని ఉదాహరణలు. కొత్త పథకాల రూపకల్పన, పాత పథకాల అమలులో మోదీ ప్రభుత్వం అనేక రెట్లు మెరుగు అనే వాస్తవాన్ని కాంగ్రెస్, విశ్లేషకులు గుర్తించాలి. కేవలం కొత్త పథకాలు ప్రారంభించడమే పరిపాలన అనుకుంటే కాంగ్రెస్ అసలు అధికారం కోల్పోయేది కాదు కదా! ■

Mann Ki Baat



# సంకల్పదినంగా ఆగస్టు 15




**జూలై 30న ఆకాశవాణిలో ప్రసారమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మనసులో మాట' (మన్ కీ బాత్)లో అనేక అంశాలను ప్రస్తావించారు. దేశంలో వరదల బీభత్సం, జీఎస్టీ, ఆగస్టు 15 సంకల్పం, భారత మహిళా క్రికెట్ జట్టుపై మోదీ తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు వారి మాటల్లోనే చూద్దాం.**

- గత కొన్ని రోజుల్లో దేశంలోని అస్సాం, ఈశాన్య ప్రాంతాలు, గుజరాత్, రాజస్థాన్, బెంగాల్లోని కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి కారణంగా వరదలు సంభవించాయి. వరద ప్రాంతాల్లో విస్తృతంగా సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కేంద్ర మంత్రులు తమకు వీలైన ప్రాంతానికి వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ పద్ధతుల్లో వరద బాధితులకు వీలైనంత సహాయాన్ని అందిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, సేవాభావంతో పని చేసే పౌరులు తమకు వీలైనంతగా సహాయ పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున జవాన్లు, వాయుసేన, విపత్తు నివారణ దళం, పారామిలిటరీ దళాలు ఆపదలో చిక్కుకున్న వారిని తమ ప్రాణాలొడ్డి సహాయపడడానికి సంతోషంగా ఏకమవుతారు. వరదల వల్ల జన జీవితం అస్తవ్యస్తంగా తయారవుతుంది. పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు నష్టపోకుండా బీమా కంపెనీలు వారికి క్లెయిమ్ సెటిల్మెంట్ వెంటనే చేసేలా, వారు ముందస్తుగా అప్రమత్తంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాం.
- జీఎస్టీ అమలులోకి వచ్చి దాదాపు నెల రోజులు గడిచింది. లాభాలు కూడా కనిపించడం మొదలైంది. జీఎస్టీ కారణంగా నిత్యావసరాల ధరలు ఎలా తగ్గాయో, వస్తువులు ఎలా చవగ్గా లభిస్తున్నాయో, వ్యాపారం మునుపటి కంటే ఎలా సులభమైందో చెప్తూ వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఉత్తరాలు వచ్చినప్పుడు చాలా సంతోషం, ఆనందం కలుగుతున్నాయి. రవాణా, లాజిస్టిక్స్ రంగంలో జీఎస్టీ ప్రభావాన్ని గమనిస్తున్నాను. ట్రక్కుల రాకపోకలు పెరిగాయి. దూరాన్ని నిర్ణయించడం సులభమైంది. ట్రక్కుల వేగం పెరగడం వల్ల కాలుష్యం కూడా తగ్గింది. సరుకులు త్వరగా చేరుతున్నాయి. ఇంతకుముందు పన్నులు విడివిడిగా ఉండడం వల్ల రవాణా, లాజిస్టిక్స్ రంగంలో ఎక్కువ వనరులు, సమయం రాత పనికే పట్టేవి. నేను గుడ్ అండ్ సింపుల్ టాక్స్‌గా పిలిచే జీఎస్టీ నిజంగానే మన ఆర్థిక వ్యవస్థ మీద చాలా తక్కువ సమయంలోనే ఒక సానుకూల ప్రభావాన్ని ఉత్పన్నం చేసింది.
- ఆగస్టు అంటే విప్లవ నెల. 1920 ఆగస్టు 1న సహాయనిరాకరణోద్యమం మొదలైంది. 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం మొదలైంది. దీనిని ఆగస్టు విప్లవమని కూడా అంటారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఈ ఏడాది మనం క్విట్ ఇండియా ఉద్యమం వజ్రోత్సవాన్ని జరుపుకోబోతున్నాం. ఈ "క్విట్ ఇండియా" నినాదాన్ని డా॥ యూసుఫ్ మెహ్రర్ అలీ ఇచ్చారన్న సంగతి చాలా కొద్దిమందికే తెలుసు. మన స్వాతంత్ర సమర యోధుల త్యాగం, తపస్సు, బలిదానాలకూ మించిన ప్రేరణ మనకేముంటుంది?
- 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చింది. ఇప్పుడు 2017. దాదాపు 70 ఏళ్లు గడిచాయి. ప్రభుత్వాలు వచ్చాయి.. వెళ్ళాయి. వ్యవస్థలు తయారయ్యాయి, మారాయి, పెంపొందాయి, పెరిగాయి. దేశాన్ని సమస్యల్లోంచి బయట పడేసేందుకు ప్రతి ఒక్కరూ తమ తమ పద్ధతుల్లో ప్రయత్నించారు. 1942 నుండి 1947 వరకూ ఐదేళ్ళూ సంకల్పసిద్ధికి ఒక మలుపు లాంటివి. 2017 నుండీ 2022 వరకూ ఈ ఐదేళ్ళు కూడా సంకల్పసిద్ధికి తోడ్పడేటివే. ఈ 2017 ఆగస్టు 15ని మనం ఒక సంకల్ప పర్వంగా జరుపుకొందాం. 2022లో స్వాతంత్ర్య వజ్రోత్సవాల సమయానికల్లా మనం ఆ సంకల్పాన్ని సాధించి తీరతాం. ఎలాగైతే 1942 నుండి 1947 వరకూ ఐదేళ్ళు దేశ స్వాతంత్ర్యానికి మైలురాళ్ళయ్యాయో... ఈ ఐదేళ్ళు, అంటే 2017 నుండీ 2022 వరకూ భారతదేశ భవిష్యత్తు కోసం అలాగే మైలురాళ్లవ్వాలి. 2017ని మన సంకల్ప సంవత్సరంగా చేసుకోవాలి. మన సంకల్పం... మురికి – క్విట్ ఇండియా, పేదరికం – క్విట్ ఇండియా, లంచగొండితనం – క్విట్ ఇండియా, ఉగ్రవాదం – క్విట్ ఇండియా, జాత్యహంకారం – క్విట్ ఇండియా!
- ఆగస్టు 15న దేశ ప్రధాన సేవకుడిగా ఎర్రకోట నుండి దేశ ప్రజలతో మాట్లాడే అవకాశం లభిస్తుంది. నేనొక నిమిత్తమాత్రుడిని మాత్రమే. అక్కడ మాట్లాడేది ఒక వ్యక్తి కాదు. ఎర్రకోట నుండి 125 కోట్ల ప్రజల స్వరం ప్రతిధ్వనిస్తుంది. గత మూడేళ్లుగా దేశం నలుమూలల నుండీ ఆగస్టు 15న నేను ఏం మాట్లాడాలి, ఏ విషయాలను చెప్పాలి అనే సూచనలు, సలహాలు అందుతూనే ఉన్నాయి. ఈసారి కూడా మై గవ్ యాప్, నరేంద్ర మోదీ యాప్‌లకు పంపాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. నేను స్వయంగా వాటిని చదువుతాను. ఆగస్టు 15 ప్రసంగంలో ప్రస్తావించడానికి ప్రయత్నిస్తాను.
- కొద్ది రోజుల క్రితం మన దేశ మహిళా క్రికెట్ టీమ్ ప్రపంచకప్ పోటీలలో అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. ఆ క్రీడాకారిణులను కలిసే అవకాశం లభించింది. వారితో మాట్లాడటం ఆనందాన్నిచ్చింది. ప్రపంచ కప్‌ను గెలవలేకపోవడం వారికి చాలా భారంగా ఉందన్న సంగతి గమనించాను. వారి మొహాల్లో కూడా ఆ నిరాశ, ఒత్తిడి తొంగిచూశాయి. మన క్రీడాకారిణులు ప్రపంచ కప్‌లో విజయాన్ని పొందలేకపోయినా, 125 కోట్ల ప్రజలూ ఆ వైఫల్యాన్ని తమ భుజాలపై వేసుకున్నారు. కొంచెం భారం కూడా మన ఆడపిల్లలపై పడనీయలేదు. ఇంతేకాక ఈ ఆడపిల్లలను మెచ్చుకుని గౌరవించారు. దీనిని ఒక శుభకరమైన మార్పుగా భావిస్తున్నాను.

**–జనసందేశ్ ప్రతినిధి**



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ




# కాంగ్రెస్‌ను పీడకలలా వెంటాడుతున్న బోఫోర్స్

● చలసాని నరేంద్ర

కాంగ్రెస్‌ను 30 ఏండ్లుగా పీడకలలా వెంటాడుతున్న బోఫోర్స్ కుంభకోణం మరోసారి తెరపైకొచ్చింది. నిందితులంతా కన్నుమూస్తున్నా, అప్పట్లో కొనుగోలు చేసిన ఫిరంగులు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాఈ కుంభకోణం ఇప్పటికీ ఆ పార్టీని వెంటాడుతూనే ఉంది.

ఇటీవల బిజెపి ఎంపీలు బోఫోర్స్ కుంభకోణంపై విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేయగా కేంద్ర ప్రభుత్వం స్పందించి బిజెడి ఎంపీ భర్తృహరి మహ్తాబ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ని ఏర్పాటు చేసింది. ఈ జూలైలో పీఏసీ అధ్యక్షుడు మహ్తాబ్, బిజెపి ఎంపీ నిషికాంత్ దుబేతో కూడిన కమిటీ సమావేశమైంది.

1989 ఎన్నికల్లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఓటమికి దారితీసిన ఈ కుంభకోణం విచారణను తిరగతోడాలని ఈ కమిటీ నిర్ణయించడంతో 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీని వెంటాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోర్టు ఉత్తరువు ద్వారా బిజెపి నాయకులు ఎల్.కె.అద్వానీ, ఉమా భారతి తదితరులపై బాబ్రీ కేసును తిరిగి తెరిచిన విధంగా బోఫోర్స్ కేసు విషయంలోనూ అదే చేయవచ్చని బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే పేర్కొన్నారు.

బోఫోర్స్ ఒప్పందానికి సంబంధించి 1986లోని కాగ్ నివేదికలో పేర్కొన్న కొన్ని అంశాలను దర్యాప్తులో పరిగణనలోకి తీసుకోలేదని ఈ కమిటీ దృష్టికి వచ్చింది. బోఫోర్స్ కుంభకోణానికి సంబంధించిన కొన్ని కీలక పత్రాలు, సమాచారం గల్లంతయ్యాయని కాగ్ తన నివేదికలో పేర్కొన్నదని, ఆ పత్రాలను వెతికి పట్టుకొని తమకు అందజేయాలని రక్షణ మంత్రిత్వ శాఖకు ఈ కమిటీ సూచించింది.

## కోర్టులలో నలుగుతున్న కేసులు

మరోవైపు ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులు మూడు దశాబ్దాలుగా కోర్టుల్లో నలుగుతూనే ఉన్నాయి. ఒకటి పూర్తయితే దానికి అనుబంధంగా మరోకేసు నమోదవుతున్నది. బిజెపి నాయకుడు, అడ్వకేట్ అజయ్ కుమార్ అగర్వాల్ 2005లో వేసిన ఓ బోఫోర్స్ అనుబంధ కేసు త్వరలో సుప్రీంకోర్టు విచారణకు రానున్నది. భారత సైన్యానికి 410 హోవిట్జర్ గన్‌లను సరఫరా చేసేందుకు స్వీడన్‌కు చెందిన బోఫోర్స్ కంపెనీ 1986 మార్చి 24న ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కోసం బోఫోర్స్ కంపెనీ లంచాలు ఇచ్చిందంటూ 1987 ఏప్రిల్ 16న స్వీడిష్ రేడియో ప్రకటన భారత్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ సహా పలువురు ప్రముఖులు లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో 1990 జనవరి 22న సీబీఐ కేసు నమోదు చేసింది. రూ.64 కోట్లు చేతులు మారాయని పేర్కొంటూ బోఫోర్స్ కంపెనీ ప్రెసిడెంట్ మార్టిన్ ఆర్డ్బో, మధ్యవర్తులుగా వ్యవహరించిన హిందూజా సోదరులు, భారత ప్రభుత్వ ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చింది. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంది.

ఈ కుంభకోణం నుంచి రాజీవ్‌గాంధీకి విముక్తి కల్పిస్తూ 2004 ఫిబ్రవరి 4న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జే.డీ.కపూర్ తీర్పునిచ్చారు. బోఫోర్స్ కంపెనీపై అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించారు. మరోవైపు ఈ కేసులో యూరప్‌కు చెందిన హిందూజా బ్రదర్స్ శ్రీ చంద్, గోపీచంద్, ప్రకాశ్ చంద్‌పై మోపిన అభియోగాలను కొట్టేస్తూ 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ బిజెపి నాయకుడు, అడ్వకేట్ అజయ్ కుమార్ అగర్వాల్ అదే ఏడాది అక్టోబర్ 18న సుప్రీం కోర్టును ఆశ్రయించగా, కోర్టు విచారణకు స్వీకరించింది. అజయ్ పిటిషన్‌పై జులై మొదటి వారంలోనే విచారణ జరుగాల్సి ఉన్నా సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## సుప్రీంలో వాదనలపై ఉత్కంఠ

కొన్నాళ్లుగా స్తబ్ధుగా ఉన్న బోఫోర్స్ కుంభకోణంలో పెద్దల హస్తం ఉందంటూ స్వీడిష్ చీఫ్ ఇన్వెస్టిగేటర్ స్టెన్ లిండ్‌స్ట్రామ్ ఇటీవల పేర్కొనడంతో మళ్లీ రాజకీయ వేడిని రగిల్చింది. ఈ కేసును తిరిగి విచారణ జరపాలంటూ బిజెపి ఎంపీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారు. మరోవైపు అజయ్ అగర్వాల్ పిటిషన్‌పై త్వరలో సుప్రీంకోర్టు వాదోపవాదాలు వినసుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

ఈ కేసుకు సంబంధించి అజయ్ జూలై 28న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు లేఖ రాశారు. కుంభకోణం వెలుగుచూసిన నాటి నుంచి 2006 వరకు జరిగిన పరిణామాలన్నీ కాంగ్రెస్ పెద్దల కనుసన్నల్లో జరిగాయని ఆరోపించారు. వెంటనే ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, మనీ లాండరింగ్ యాక్ట్‌ల కింద విచారణ జరుపాలని కోరారు.

ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పుపై సీబీఐ సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నా అప్పీల్ చేయలేదు. దీనిపై 2016 డిసెంబర్ 1న వివరణ ఇస్తూ పిటిషన్ దాఖలుకు అప్పటి ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వలేదని సీబీఐ వెల్లడించింది. సీబీఐ డైరెక్టర్ అలోక్ కుమార్ పార్లమెంటరీ కమిటీ ముందు హాజరై అప్పటి ప్రభుత్వం ఈ కేసును మూసివేయాలని భావించిందని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు తలచుకుంటె తిరిగి కేసు దర్యాప్తును ప్రారంభించవచ్చని చెప్పారు. అయితే ఈ కేసును తిరిగి చేపట్టే అవసరం, అవకాశం గురించి పార్లమెంటరీ కమిటీ ముందు ప్రతిపాదనలు ఉంచాల్సింది, సిఫార్సు చేయాల్సింది సీబీఐ మాత్రమే అని బిజెపి స్పష్టం చేస్తోంది. పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వ విభాగం కాదు. పార్లమెంట్ ఏర్పాటు చేసిన కమిటీ.. దానిలో అన్ని పార్టీల వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

## ఖత్రోచీ పరారీకి కాంగ్రెస్ సహకారం

ఈ కేసులో ప్రధాన నిందితుడైన యూరప్‌కు చెందిన మధ్యవర్తి ఖత్రోచీ 1993 జూలై 29న అర్ధరాత్రి దేశం విడిచి పారిపోయారు. అతనికి అప్పటి ప్రభుత్వంలోని కాంగ్రెస్ పెద్దలే సహకరించారని ప్రధాన ఆరోపణ. అప్పటి నుంచి అతను కోర్టు విచారణకు హాజరుకాలేదు. ఖత్రోచీ లండన్ బ్యాంకు అకౌంట్లను గతంలో కేంద్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయగా 2006లో యూపీఏ ప్రభుత్వం ఆంక్షలు ఎత్తేసింది. అప్పటికే అకౌంట్లలో రూ.250 కోట్లు ఉన్నట్టు అంచనా. మరోవైపు అతడిపై మోపిన అభియోగాలను కొట్టివేస్తూ 2011 మార్చి 4న సీబీఐ కోర్టు తీర్పునిచ్చింది. ఖత్రోచీ 2013 జూలై 13న మరణించారు. ■

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. – బార్కం




# పాక్‌లో పరిణామాలు - భారత్‌పై ప్రభావం

• రాకా

పొరుగుదేశం పాకిస్థాన్‌లో శరవేగంగా సంభవిస్తున్న పరిణామాలు ఆశ్చర్యం కలిగించినా అనూహ్యమేమీ కావు. పనామా గేట్ కుంభకోణంలో సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా నవాజ్ షరీఫ్ పదవికి అనర్హుడయ్యారు. ఆయన రాజకీయ వారసురాలిగా భావించిన కుమార్తె మరియం, ఇద్దరు కుమారులు కూడా దోషులుగా నిర్ధారణ అయ్యారు. పాక్ చరిత్రలో ఏ ప్రధాన మంత్రీ తన పూర్తి కాలపరిమితి వరకూ పాలించలేదు. మూడు సార్లు ప్రధాని అయిన నవాజ్ షరీఫ్ పాలనకు అయిదేళ్లు పూర్తి కాకుండానే నూరేళ్లు నిండిపోయాయి.

ఇప్పటికైతే జాతీయ అసెంబ్లీలో మెజారిటీలో ఉన్న నవాజ్ షరీఫ్ తన నమ్మిన బంటు అబ్బాసీని ప్రధాని చేశాడు. తన సోదరుడు, పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి షాహ్‌బాజ్ షరీఫ్ పార్లమెంటుకు ఎన్నికయ్యే వరకు అబ్బాసీ పాలనలో ఉండాలి. క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని పాకిస్థాన్ తెహరీకె ఇన్సాఫ్ ఉద్యమాల అలజడిలో నవాజ్, ఆయన పార్టీ ముస్లిం లీగ్‌లు ఎలా మనుగడ సాగిస్తాయన్నది ప్రశ్నార్థకం. ఇంకో ఆశ్చర్యం ఏమిటంటే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రభుత్వానికి, నియంతలకు మధ్య పోరాటం వచ్చినప్పుడు కోర్టులెప్పుడూ ప్రజాస్వామ్యం వైపే నిలిచాయి. కానీ పాకిస్థాన్‌లో మాత్రం అందుకు భిన్నంగా కోర్టులు మొదట్నుంచీ సైన్యానికి మద్దతుగానే నిలుచున్నాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వాల పక్షాన నిలబడ లేదు. సైన్యం వాదననే బలపరిచాయి. మరోమాటలో చెప్పాలంటే పాకిస్థాన్‌లో న్యాయ వ్యవస్థ కూడా సైన్య వ్యవస్థ కొమ్ము కాస్తూ వస్తోంది.

## సైన్యమే అసలైన అధికార కేంద్రం

నిజం చెప్పాలంటే పాకిస్థాన్‌లో అసలు పాలకుడు సైన్యమే. అధికారంలో ఉన్న వారెవరైనా సైన్యం కనుసన్నల్లో ఉండాల్సిందే. సైన్యానికి ఇష్టం లేని పనిని మానుకోవాల్సిందే. కాబట్టే ఏ నిర్ణయమైనా సైన్యం అనుమతితో జరగాలి. పేరుకు దేశానికి రాజధాని ఇస్లామాబాద్ అయినా, నిజమైన నిర్ణయాధికారం మాత్రం రావల్పిండి (సైన్యం హెడ్‌క్వార్టర్స్)లోనే ఉంటుంది. సైన్యానికి ఇష్టం లేని పాలకుడు ఎక్కువ కాలం ఉండలేదు. అందుకే సైన్యాన్ని దౌత్య భాషలో డీప్‌స్టేట్ అంటారు. అంటే కనిపించని అసలు పాలకుడన్న మాట. ఒక్క ఉదాహరణ చెబితే సరిపోతుంది. 1971 యుద్ధంలో పాకిస్థాన్ చిత్తు చిత్తుగా ఓడిపోయింది. దాదాపు లక్ష మందికి పైగా పాక్ సైనికులు భారత్ చేతిలో యుద్ధ బందీలయ్యారు. ఈ ఘోర పరాజయంపై పాకిస్థాన్ ప్రభుత్వం హమూదుర్ రహ్మాన్ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ నివేదికను రహస్యంగా ఉంచాలని సైన్యం భావించింది. అప్పుడు ప్రధానిగా ఉన్న జుల్ఫికర్ అలీ భుట్టో ఈ మేరకు సైన్యంతో అవగాహనకు వచ్చారు. సైన్యం ఆయనకు సహకరించింది. ఆయన నివేదికను తొక్కిపెట్టి ఉంచారు. అదేవిధంగా ఒకవైపు పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్, భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిలు లాహోర్ బస్ యాత్ర నిర్వహించి, మైత్రీ సంబంధాలు పెంచుతూంటే, మరోవైపు పాక్ సైన్యం కార్గిల్‌లో దురాక్రమణకు పాల్పడింది. సైన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నవాజ్ కూడా ఒప్పుకోక తప్పలేదు.

నవాజ్ షరీఫ్‌కి సైన్యానికి మధ్య సత్సంబంధాలు లేవు. అందుకే సైన్యం పాకిస్థాన్ తెహరీకె ఇన్సాఫ్ అధినేత మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌ను, పాకిస్థాన్‌లో ఎంతో పలుకుబడి ఉన్న మత ప్రచారకుడు తాహెరుల్ ఖాద్రీలను ముందుకు తోసి, నవాజ్‌కు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించేలా చేసింది. వీరి సభలు, సదస్సులకు జనాన్ని తోలింది. నవాజ్ షరీఫ్‌ను బలహీనపరిచేందుకు అన్ని విధాలా ప్రయత్నించింది. పనామా గేట్ ప్రకరణంలో నవాజ్, ఆయన కుటుంబ సభ్యులను ఇరుకున పెట్టడంలో కూడా సైన్యం తన వంతు పాత్రను పోషించింది. న్యాయస్థానాలు సైతం దీనికి తోడ్పడ్డాయి. ఫలితంగా నవాజ్ పదవీచ్యుతుడయ్యారు.

## భారత ద్వేషమే పాకిస్థాన్‌కి ప్రాణ వాయువు

అయితే వీటన్నిటి ఫలితం మన దేశంపై ఎలా ఉంటుందన్నదే మనకు ముఖ్యం. పాకిస్థాన్ తొలి నుంచీ తన అంతర్గత సమస్యల నుంచి దృష్టి మరలించేందుకు భారత్ పట్ల విద్వేషాన్ని పెంచుతూ వస్తోంది. బలహీనపడుతున్న నవాజ్ అదే చేశారు. బలపడుతున్న సైన్యం అదే చేసింది. మొదట్నుంచీ ఇదే జరుగుతోంది. సైన్యంతో సంబంధాలు చెడగానే బేనజీర్ భుట్టో కశ్మీర్‌పై రెచ్చగొట్టే ప్రసంగాలు చేసింది. ఆమెను దెబ్బ తీసేందుకు సైన్యం ఏకంగా టెర్రరిజంను పోషించింది. ఈ సారి కూడా ఇదే జరిగే అవకాశం ఉంది. అబ్బాసీ షాహ్‌బాజ్ వచ్చే వరకూ కీలుబొమ్మ ప్రధానిగా ఉన్నా, లేక షాహ్‌బాజ్‌ను పక్కన పెట్టి సైన్యంతో చేతులు కలిపి పనిచేసినా, లేక ప్రత్యక్షంగా సైన్యమే రంగంలోకి దిగినా, లేకపోతే ఇమ్రాన్ ఖాన్ వంటి కీలుబొమ్మల సాయంతో సైన్యం పాలన పగ్గాలు చేపట్టినా తమ బలహీనతలను, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వారు కశ్మీర్ వివాదాన్ని లేవనెత్తవచ్చు. సరిహద్దుకు అటు వైపు నుంచి ఉగ్రవాదులను పంపించవచ్చు. లేదా ముంబాయి, పఠాన్‌కోట్ వంటి పేలుళ్లను, ఉగ్రదాడులను నిర్వహించవచ్చు.

నిజానికి విద్యుత్ సరఫరా, రహదారుల నిర్వహణ, విద్యాలయాల నిర్వహణ వంటి కనీస సదుపాయాలను సైతం పాకిస్థాన్ ప్రభుత్వం అందించలేకపోతోంది. ఖైబర్ ఫక్తూన్ ఖ్వా, స్వాత్, చిత్రల్ వంటి చోట్ల ఇస్లామిక్ ఉగ్రవాదులు, తాలిబాన్, అల్ కాయిదాలు పాక్ ప్రభుత్వ మనుగడనే సవాలు చేస్తున్నాయి. బలూచిస్థాన్, గిల్గిత్ బల్టిస్థాన్‌లలో స్వాతంత్ర్యోద్యమాలు చెలరేగుతున్నాయి. సింధ్‌లో పంజాబ్ ఆధిపత్యవాదం పట్ల అసంతృప్తి పెల్లుబుకుతోంది. పంజాబ్‌లో తహరీకె తాలిబాన్ ఉగ్రవాద సంస్థ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ఢీకొంటోంది. ఆర్థికంగా పాకిస్థాన్ అత్యంత దయనీయ స్థితిలో ఉంది. ప్రజలకు కనీసం పోలియో వ్యాక్సిన్ వేయడానికి కూడా ఏర్పాట్లు చేయలేని పరిస్థితులున్నాయి. వీటన్నిటి నుంచి దృష్టి మరలించడానికి పాకిస్థాన్ వద్దనున్న జిందా తిలిస్మాత్ ఔషధం భారత వ్యతిరేకత. జెహాదీ ఉన్మాదాన్ని ప్రోత్సహించి, భారత వ్యతిరేకత మాటున పబ్బం గడుపుకోవడమే పాకిస్థాన్ మొదట్నుంచీ చేస్తోంది. ఇప్పుడూ అదే జరిగే ప్రమాదం ఉంది.

కాబట్టి భారత్ ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. పాకిస్థాన్ డీఎన్ఏలోనే భారత వ్యతిరేకత ఉంది. పాలకులెవరైనా తమ ఏలుబడిని కొనసాగించాలంటే భారత ద్వేషమనే పులిని స్వారీ చేయాల్సిందే. ఇప్పుడున్న అస్థిర పరిస్థితుల్లో అటు సైన్యం, ఇటు నవాజ్ షరీఫ్, మరోవైపు సైన్యం కీలుబొమ్మ ఇమ్రాన్ ఖాన్‌లు భారత ద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ




# కశ్మీర్ లోయలో వేర్పాటువాద ఉగ్రవాదుల తిరోగమనం

• సుధా కస్తూరి

జమ్మూ కశ్మీర్‌లో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న దృఢ వైఖరి, పటిష్ట వ్యూహం కారణంగా సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. దక్షిణ కశ్మీర్‌కు మాత్రమే పరిమితమైన ఉగ్రవాదం, వేర్పాటువాదాన్ని అణచివేయడానికి కేంద్రం త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. స్థానిక ఉగ్రవాదులు, బయట నుంచి వచ్చిన ఉగ్రవాదులను ఏరివేయడం, వారిని మట్టుపెట్టడం ఈ త్రిముఖ వ్యూహంలోని మొదటి భాగం. ఉగ్రవాదం, వేర్పాటువాదాన్ని పెంచి ప్రోత్సహిస్తున్న హురియత్ వంటి సంస్థలను నిర్వీర్యం చేయడం, వేర్పాటువాదాన్ని నడిపించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు అందకుండా చేయడం, నిధుల ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం. తద్వారా విచ్ఛిన్నవాదులకు ఆక్సిజన్ అందకుండా చేయడం. ఇక మూడో అంశం సాధారణ ప్రజానీకంలో ఉన్న అసంతృప్తులను తొలగించడం, ప్రజల హృదయాలను అభివృద్ధి తంత్రంతో గెలుచుకోవడం. ఉగ్రవాదం ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించలేదన్న నమ్మకాన్ని కలిగించడం.

మోదీ ప్రభుత్వం ఈ మూడింటిని నిజాయితీగా అమలు పరచడం వల్ల కశ్మీర్‌లోయలో ఫలితాలు కనిపిస్తున్నాయి. గత జూలై నుంచి ఈ జూలై వరకూ 199 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుపెట్టాయి. నిజానికి ఉగ్రవాదుల్లో హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల్లో స్థానిక ఉగ్రవాదులు ఎక్కువగా ఉంటారు. లష్కర్ వంటి సంస్థల్లో విదేశీ ఉగ్రవాదులు ఎక్కువగా ఉంటారు. ఇరు వర్గాల విషయంలో భిన్న ధోరణులను అవలంబించాల్సిన అవసరం లేదు. ఉగ్రవాది ఉగ్రవాదే. స్థానికుడైనా, పాకిస్థానీయుడైనా మట్టు పెట్టాల్సిందే. ఈ విషయంలో కేంద్రం అవలంబించిన దృఢ వైఖరి వల్ల బుర్హన్ వానీ, అతని తరువాత హిజ్బుల్ ముజాహిదీన్‌కి నాయకత్వం వహించిన సబ్జర్ అహ్మద్ భట్‌లు హతమయ్యారు. అంతే కాదు. వారి ముఠాలోని సభ్యులందరినీ హతమార్చడంతో ఉగ్రవాదం వెన్ను విరిగింది. మరోవైపు బుర్హన్ వానీ చనిపోయి ఏడాది అయిన సందర్భంగా కశ్మీర్ లోయలో ఎక్కడా ఎలాంటి సంఘటన జరగలేదు. ఆయన తరువాత హిజ్బుల్ కమాండర్‌గా వచ్చిన సబ్జార్ భట్ చనిపోయినప్పుడు కశ్మీర్‌లో ఎలాంటి ఉద్రిక్తత లేదు.


కొన్ని నెలల క్రితం వరకూ కశ్మీర్‌లోయలో 282 మంది ఉగ్రవాదులు ఉన్నట్టు అంచనా. వీరిలో ఉత్తర కశ్మీర్‌లో 141 మంది, దక్షిణ కశ్మీర్‌లో 112 మంది ఉన్నారు. ఉత్తర కశ్మీర్‌లో 23 మందే స్థానిక ఉగ్రవాదులు. 118 మంది పాకిస్థాన్ నుంచి వచ్చిన వారు. దక్షిణ కశ్మీర్‌లో 99 మంది స్థానికులు. 13 మంది పాకిస్థానీలు. ఇప్పుడు భద్రతా దళాల చర్యల కారణంగా కేవలం 90 మంది ఉగ్రవాదులు మాత్రమే మిగిలి ఉన్నారు. మరోవైపు కేంద్రం సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద పటిష్టమైన ఏర్పాటు చేయడం వల్ల పాకిస్థాన్ నుంచి చొరబాట్లు గణనీయంగా తగ్గాయి. బయట నుంచి ఆక్సిజన్ అందడం లేదు. లోపల పొగ పెట్టింది. దీంతో ఉగ్రవాదం నానాటికీ కృశించిపోతోంది. ఉగ్రదాదులు తగ్గి, ఉగ్రవాదుల మరణాల సంఖ్య పెరగడం పరిస్థితిలో మార్పును సూచిస్తోంది.

నిజానికి స్థానిక జమ్మూకశ్మీర్ పోలీసులు, స్థానిక ప్రజల సహకారం లేనిదే ఇంతమంది ఉగ్రవాదులను మట్టుపెట్టడం అసాధ్యం. ఈ విషయాన్ని చాలా మంది గమనించడం లేదు. బుర్హన్ వానీ ఆచూకీని చెప్పింది బమ్‌దూర్ గ్రామవాసులే. ఇతర గ్రామాల నుంచి వచ్చిన మూకలు కోపంతో ఈ గ్రామంలో ఇళ్లకు నిప్పంటించాయి కూడా. పదకొండు కుటుంబాలకు చెందిన 70 మంది నిరాశ్రయులయ్యారు. అయినా స్థానికులు బుర్హన్ వానీకి వ్యతిరేకంగా నిలిచారు. అదేవిధంగా సబ్జార్ అహ్మద్ భట్ ఒక యువతిని బలవంతంగా అనుభవించేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. ఎన్ కౌంటర్‌లో హతమయ్యాడు. ఎనిమిది సార్లు భద్రతాదళాల నుంచి తప్పించుకున్న ఉగ్రవాది అబ్దుల్లా ఉని 2013లో ఇలాగే బలాత్కారానికి గురైన ఒక మహిళ పట్టించడం వల్లే దొరికి, హతమయ్యాడు. చాలాచోట్ల స్థానిక ప్రజలే ఉగ్రవాదులను పట్టించి ఇస్తున్నారు.

మరోవైపు ఉగ్రవాదులకు ఆర్థిక వనరులను, అండదండలను సమకూరుస్తున్న నెట్‌వర్క్‌లపై పోరాటం చేయడం అత్యంత కీలకం. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జాతీయ దర్యాప్తు బృందం పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వద్ద జరిగే సరకు రవాణా, వాణిజ్య లావాదేవీలపై నిఘా వేయడంతో వివిధ మార్గాల్లో వస్తున్న నిధులను అడ్డుకోగలిగింది. వ్యాపారాల ముసుగులో వస్తున్న ధనాన్ని గుర్తించి, కశ్మీర్‌లోయలో పేరు మోసిన వ్యాపారులను పట్టుకోవడంతో హురియత్ కంగుతిన్నది. హురియత్ నేతాగణానికి చెందిన ఏడుగురు ప్రముఖులను అరెస్ట్ చేయడం కూడా చిన్న విషయమేమీ కాదు. హురియత్ నేతలంతా రాళ్లు విసిరే మూకలతో జరిపిన ఫోన్ సంభాషణల ఆధారంగానే వారిని అరెస్టు చేయడం జరిగింది. ప్రతిచోటా అదే రాళ్లు విసిరే మూక ప్రత్యక్షం కావడం గుర్తించిన గూఢచారి వర్గాలు వారిని పట్టుకున్నాయి. వారి నుంచి లభ్యమైన సమాచారం ఏకంగా ఉగ్రవాదుల ఆర్థిక మూలాలను దెబ్బ తీసింది.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం రహదారుల మెరుగుదల, రవాణా సౌకర్యాల కల్పన, విద్యా వ్యవస్థలో మార్పులు, ప్రజలకు వివిధ సదుపాయాల కల్పనల ఆధారంగా ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది. వీటన్నిటి వల్ల కశ్మీర్ లోయలో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. జీఎస్‌టీ బిల్లును కశ్మీర్‌కు వర్తింపచేయడం, జమ్మూ కశ్మీర్‌లో గణాంకాల సేకరణకు వీలు కల్పించే కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ (అమెండ్‌మెంట్) బిల్లు 2017ను ఆమోదింపచేయడం వంటివి జమ్మూకశ్మీర్ మిగతా దేశం కన్నా భిన్నమైనదన్న వాదనను కొట్టిపారేస్తున్నాయి. ఈ రెండు బిల్లులు ఆమోదింపచేస్తున్నప్పుడు ఎలాంటి వివాదమూ తలెత్తలేదు. రాజకీయ వాదులెవరూ వ్యతిరేకించలేదు. చాలా సజావుగా ఇవి ఆమోదం పొందడం కశ్మీర్‌లోయలో మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. మొత్తం మీద కశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటు వాదాలు తిరోగమనంలో ఉన్నాయి. జాతీయ వాద శక్తులు బలోపేతమవుతున్నాయి. ■

విశ్లేషణ



# సంచలనం కోసమే డ్రగ్స్ విచారణ..?

• ప్రవీణ్

నెల రోజులకు పైగా తెలుగు చిత్ర పరిశ్రమ అంతా డ్రగ్స్ మహమ్మారి వ్యాపించిందని, డ్రగ్స్ మాఫియాతో సినీ ప్రముఖులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని విశేష ప్రచారం ఇస్తూ వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను విచారణ కోసం రప్పించి, గంటల తరబడి విచారణ జరిపించారు. ఈ విచారణ అంశాలు అన్ని మీడియాలో ప్రముఖంగా ప్రచారం అయ్యే విధంగా జాగ్రత్త తీసుకున్నారు.

డ్రగ్స్ వ్యవహారంలో ఎవరిని వదిలిపెట్టేది లేదని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసులో పెద్దలను వదిలిపెట్టి చిన్న నటులనే లక్ష్యంగా పెట్టుకున్నారని వస్తున్న ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదంటూ నమ్మబలికారు. పైగా, మియాపూర్ భూకుంభకోణం మరుగున పర్చేందుకే ప్రభుత్వం డ్రగ్స్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చిందన్న ప్రచారాన్నీ ఆయన ఖండించారు. మరోవంక డ్రగ్స్ కేసు విచారణలో బయటపడుతున్న మరికొందరు సినీ పెద్దలు, నటుల పేర్లను వెల్లడించొద్దనే ఒత్తిడి, బెదిరింపులు వస్తున్నాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ స్వయంగా చెప్పారు. రవితేజ, ఛార్మి, ముమైత్ ఖాన్, నవదీప్, తరుణ్ వంటి పేరున్న నటుల విచారణకు లభించిన ప్రచారం ఇతరులకు రాలేదు. ఒక విధంగా మీడియా లైవ్ కవరేజ్‌లో విచారణ జరుపుతున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

వెయ్యిమందికి పైగా కళాశాల విద్యార్థులు, పారిశ్రామికవేత్తల పిల్లలు డ్రగ్స్ వాడుతున్నారనే సమాచారంతో వారితో పాటు కాలేజీలకు నోటీసులు పంపామని సబర్వాల్ తెలిపారు. ఎప్పుడు, ఎన్ని గంటలకు ఎవరెవరు విచారణకు వస్తున్నారో ముందుగానే ప్రచారం చేస్తున్నారు. అయితే సినీ ప్రముఖుల పేర్లను తప్ప మిగిలిన వారి పేర్లను 'లీక్' చేయడం లేదు.

ఒక వంక అధికారులు ఐదవ అంతస్తులో విచారణ జరుపుతూ ఉంటే... ఏమేమి ప్రశ్నలు వేశారు, ఏమేమి జవాబులు ఇచ్చారు అంటూ టీవీ ఛానెల్స్ ప్రసారం చేస్తున్నాయి. ఇటువంటి కథనాలను ఇప్పటి వరకు సబర్వాల్ ఖండించలేదు. ఎవరు 'లీక్' చేస్తున్నారన్న దానిపైనా శ్రద్ధ చూపలేదు. మరి కొందరు ప్రముఖ నటుల పేర్లు కూడా ఉన్నాయంటూ జనంలో ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రభుత్వం నిజంగా డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతుందనే అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదంతా కేవలం ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుండి మళ్లించడం కోసమే చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ప్రకటన స్పష్టం చేస్తోంది. వాడకందార్లను బాధితులుగానే చూడాలని, డ్రగ్స్ వ్యాపారం, సరఫరాలో భాగస్వాములైన వారిపైనే చర్యలు ఉంటాయని పేర్కొనడం ఇప్పుడు విచారణ ఎదుర్కొంటున్న సినీ ప్రముఖులపై ఎటువంటి కేసులు పెట్టే ఆలోచన లేదని 'అభయం' ఇచ్చినట్లు అర్థం అవుతుంది.

విచారణలో మాత్రం పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయంటూ.. హైదరాబాద్‌కు స్పెయిన్, థాయిలాండ్, పోర్చుగల్, నైజీరియా, నెదర్లాండ్స్, కొలంబియా తదితర దేశాల నుంచి డ్రగ్స్ వస్తున్నట్లు సమాచారం ఉందని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. అంటే జాతీయ, అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా హైదరాబాద్‌లో స్థావరం ఏర్పాటు చేసుకున్నట్లు భావించాలి. హైదరాబాద్‌ను చుట్టుముట్టిన డ్రగ్స్ మాఫియాపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంటే ఇదేమీ పెద్ద సమస్య కాదన్నట్లు ముఖ్యమంత్రి మాట్లాడటం విస్మయం కలిగిస్తోంది. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారి వ్యాపించిందనే ప్రచారం తప్పంటూ దేశవ్యాప్తంగా డ్రగ్స్ ఎక్కువగా వాడే, ఎక్కువగా సరఫరా జరిగే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, నగరాల్లో హైదరాబాద్ లేదని కేసీఆర్ స్పష్టం చేశారు.

డ్రగ్స్ భూతం తెలంగాణలో ప్రవేశించకూడదని, వ్యాప్తి చెందకూడదని ప్రభుత్వం దాని మూలాలను పట్టుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఇప్పటికే కీలక ఆధారాలు, సూత్రధారుల వివరాలు లభించాయని అంటున్నారు. ఒక వంక డ్రగ్స్ సమస్య పెద్దగా లేదంటూ, ఈ వ్యవహారంలో జాతీయ, అంతర్జాతీయ సంబంధాలు ఉన్నాయని, వేలాదిమందికి ఇందులో సంబంధం ఉందని ముఖ్యమంత్రి చెప్పడం వాస్తవాలను దాచేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానం కలుగుతున్నది.

గుడుంబాను దాదాపు నిర్మూలించగలిగామని, పేకాట క్లబ్బులను, హుక్కా సెంటర్లను మూసివేయించామని కేసీఆర్ ఘనంగా చెప్పుకొంటున్నారు. అయితే హైదరాబాద్‌లో పబ్‌లు వ్యాప్తి చేస్తున్న విష సంస్కృతి గురించి ముఖ్యమంత్రి మౌనం వహించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ముఖ్యమంత్రి తనయుడు మంత్రి కె.టి.రామారావు బంధువులకు చెందిన ఒక పబ్, అధికార పార్టీకి సన్నిహితంగా ఉన్న వ్యక్తుల పబ్‌లపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. వీటి పర్యవేక్షణ పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నట్లు కనిపించడం లేదు.

అనుమానితులను విచారిస్తున్న ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నిత్యం నివేదికలు పంపడం, ఆయనతో సంప్రదింపులు జరపడం విస్మయం కలిగిస్తుంది. ఒక నేరాన్ని విచారిస్తున్న అధికారులు డీజీపీ వంటి వారికి జవాబుదారీగా ఉండాలి. కానీ ప్రధాన కార్యదర్శికి జవాబుదారీగా వ్యవహరించడం అంటే రాజకీయ నాయకత్వం విచారణను అదుపు చేస్తున్నట్లు భావించాల్సి ఉంటుంది.

నార్కోటిక్స్ సెంట్రల్ బ్యూరో (ఎన్‌సీబీ) వివరాలను చూపించి కేసీఆర్ హైదరాబాద్, తెలంగాణ డ్రగ్స్ నేరాలు జరుగుతున్న జాబితాలో లేదని చెప్పే ప్రయత్నం చేశారు. డ్రగ్స్ మాఫియా పట్ల తెలంగాణ ప్రభుత్వం, అంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయక పోవడమే అందుకు ప్రధాన కారణం. కానీ ఇక్కడ డ్రగ్స్ సరఫరా లేకపోవడం కాదు. కార్పొరేట్ స్కూల్‌లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. సినీ పరిశ్రమతో పాటు అనేకమంది దీనికి బానిసలుగా మారినట్టు తెలుస్తున్నది. పలు ఐటీ సంస్థల కాంటీన్‌లలోనే బహిరంగంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు కథనాలు వచ్చాయి. కానీ ఒక్క ఐటి పరిశ్రమపై కూడా సిట్ అధికారులు దాడి చేయక పోవడం గమనార్హం. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా వాస్తవాలను దాచిపెట్టి, వ్యూహాత్మకంగా ప్రజల దృష్టి మళ్లించేలా 'సంచలనం' కలిగించే కొన్ని ఎంపిక చేసిన అంశాలను మాత్రమే 'లీక్' చేస్తున్నట్లు భావించాల్సి వస్తోంది. ■



ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు పూలే

వర్తమానం

# నేరెళ్ల బాధితుల పక్షాన బిజెపి

• అభినవ్

తెలంగాణకు దళితుడే తొలి ముఖ్యమంత్రి అని చెప్పి మాట తప్పడం మొదలు కేసీఆర్ దళితులను చిన్నచూపు చేస్తూనే ఉన్నారు. తాజాగా సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటన మరో ఉదాహరణ. ఇసుక మాఫియాకు కొమ్ము కాసిన అధికార పార్టీ పెద్దలు పోలీసులతో దళితులపై దాడులకు తెగబడ్డారు. దీంతో రెక్కాడితే డొక్కాడని దళిత యువకులు ఆస్పత్రి పాలయ్యారు. తీవ్ర అనారోగ్యానికి గురై జీవితం దుర్భరంగా మారింది.

టీఆర్ఎస్ బడానేతల కనుసన్నల్లోనే సిరిసిల్ల జిల్లా కొదురుపాక ఇసుక క్వారీ నుండి ఇసుక దారి మళ్లుతోంది. దీనిపై అధికార యంత్రాంగం చూసీ చూడనట్టే వ్యవహరిస్తోంది. ఈ తరుణంలో తంగెళ్లపల్లి మండలం నేరెళ్లలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు లారీని దగ్ధం చేశారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేసి నేరెళ్ల–చేవెళ్ల గ్రామాల నుండి 12 మందిపై కేసు నమోదు చేసి ఈ ఘటనతో సంబంధం లేని 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై అక్రమ కేసులు బనాయించి, ఠాణాలో నిర్బంధించి మత్తు మందు ఇంజెక్షన్లు



ఇచ్చుకుంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. కోర్టు వీరిని రిమాండ్‌కు పంపించగా వీరి ఒంటిపై ఉన్న గాయాలను చూసి జైలర్ బెంబేలెత్తిపోయి వీరిని తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

దళితులపై దాడిని నిరసిస్తూ బిజెపి ఆందోళనకు దిగింది. దళితులను చిత్రహింసల కు గురి చేసిన ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఎస్సై బి.రవీందర్‌లను సస్పెండ్ చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కె.రాములు జూలై 26న



బహిరంగ విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, ఎస్పీ విశ్వజిత్ కంపాటి, డీఎస్పీ చంద్రశేఖర్ సమక్షంలో బాధితులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదం నుంచి అరెస్టు వరకు బాధితుల నుంచి జరిగిన విషయాలను తెలుసుకున్నారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్, రూరల్ సీఐ శ్రీధర్, ఎస్సై వెంకట కృష్ణ నుంచి వాగ్మూలం తీసుకున్నారు. దళితులను ఉద్దేశ్యపూర్వకంగా నిర్బంధించి కొట్టారని, ఇందుకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. బాధితులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, లేదా ఒక్కొక్కరికి మూడెకరాల భూమి కేటాయించాలని కోరారు.

బిజెపి బాధితుల పక్షం నిలిచింది. రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు బాధితులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితులైన దళితుల పక్షాన బిజెపి నిలిచేసరికి ఇతర పార్టీలు సైతం ముందుకు వచ్చాయి. దళితులకు న్యాయం చేసి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి. టీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని ఎండగడుతున్నాయి. ■





"లారీ దగ్ధం కేసులో ఎలాంటి సంబంధం లేని అమాయకులైన దళితులను పోలీసులు చిత్రహింసలకు గురిచేయడాన్ని ఖండిస్తున్నాను. ఈ సంఘటనపై ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలి. బాధితులకు మెరుగైన వైద్యం అందించి, ఆదుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా దీనిపై సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి."




# హింస మీదే కమ్మీల నమ్మకం

34 ఏళ్ల ఆరెస్సెస్ కార్యకర్తను కిరాతకంగా హత్య చేసిన దిగ్భ్రాంతి నుంచి కేరళ ఇంకా కోలుకోలేదు. సీపీఐ(ఎం) హంతక ముఠా రాజేశ్ అనే ఆరెస్సెస్ కార్యకర్తను కిరాతకంగా కడతేర్చింది. బిజెపి నాయకుల ఇళ్ల మీద, కార్పొరేషన్ కౌన్సిలర్ల మీద, కార్యకర్తల మీద, సానుభూతిపరుల మీద కేరళ రాజధానిలో జూలై 27 నుంచి దాడులు జరుగుతున్నాయి. కాని మార్క్సిస్టు పార్టీ నాయకత్వంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అంతా బాగానే ఉందనే వైఖరి అనుసరిస్తోంది. తిరువనంతపురం రాష్ట్ర రాజధాని మాత్రమే కాదు మార్క్సిస్టుల భయోత్పాతానికి కూడా కేంద్రం అన్న అభిప్రాయం ఇదివరకే ఉంది. ఈ అభిప్రాయం గతంలో కన్నూరు విషయంలో మాత్రమే ఉండేది. అక్కడ పినరాయ్ విజయన్ నాయకత్వంలో బిజెపి-ఆరెస్సెస్ కార్యకర్తల మీద కనికరం లేకుండా దాడులు కొనసాగుతాయి. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్ర గవర్నర్ పి.సదాశివన్ ముఖ్యమంత్రిని, పోలీసు విభాగం అధిపతి లోకనాథ్ బెహరాను రాజ్‌భవన్‌కు పిలిపించి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి గురించి ఆరా తీయాల్సి వచ్చింది. ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసాకాండకు తావు లేదని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా చెప్పాల్సి వచ్చింది.

శాంతిభద్రతల వ్యవహారంలో జోక్యం చేసుకునే అధికారం గవర్నరుకు లేదంటూ వామపక్ష మేధావులు, న్యాయవాదులు, రాజకీయ విశ్లేషకులు ఇప్పటికే ఆందోళన ప్రారంభించారు. గవర్నర్ జోక్యం చేసుకోవడం ఫెడరల్ సూత్రాలకు విరుద్ధమని వాదిస్తున్నారు. అయితే ఆరెస్సెస్ కార్యకర్తను హతమార్చిన పది మందిలో తొమ్మిది మందిని పోలీసులు 24 గంటల్లోగా అరెస్టు చేశారు. అందులో తరచుగా నేరాలు చేసే ఓ ముఠా నాయకుడు కూడా ఉన్నారు. ఈ హత్యలో తమకేమీ సంబంధం లేదని సీపీఐ(ఎం) అంటోంది. ఇలాంటి సంఘటన జరిగినప్పుడల్లా సీపీఐ(ఎం) తప్పుడు సమాచారం ప్రచారంలో పెట్టడానికి అలవాటు పడింది. దోషులు పట్టుబడడమే అరుదు. అలాంటి సందర్భాలలో తమకు సంబంధం లేదని చెప్తుంటారు.

రాష్ట్ర రాజధానిలో బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తల మీద దౌర్జన్యం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదు. అక్కడ బిజెపి, ఆరెస్సెస్ పలుకుబడి పెరుగుతున్న కొద్దీ వారి మీద హింసాకాండ పెచ్చరిల్లుతోంది. తిరువనంతపురం జిల్లా నెమాం నియోజకవర్గం నుంచి బిజెపి సీనియర్ నాయకుడు ఓ.రాజగోపాల్ ఎన్నికయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్ష ఫ్రంట్‌కు మూడో స్థానం మాత్రమే దక్కింది. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికలలో బిజెపి అద్భుత విజయాలు సాధించింది. తమ బలం కోల్పోతున్నందువల్ల మార్క్సిస్టులు హింసాకాండకు దిగుతున్నారు. బెంగాల్‌లో కూడా ఇలాగే జరిగింది. ఆధునిక సమాజం భయోత్పాతాన్ని, హింసా రాజకీయాలను ఆమోదించదని గ్రహిస్తే వారికే మంచిది.

**-జనసందేశ్ ప్రతినిధి**



ఖేలో భారత్ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలై 29న మల్కాజ్‌గిరి బీజేవైఎం ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు, జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్.శ్రీనివాస్ ముదిరాజ్, ప్రసన్న, డివిజన్ అధ్యక్షుడు సదానంద్ గౌడ్, బీజేవైఎం నాయకులు చందు, ఎస్.సి.మోర్చా నాయకులు గన్న, సూరజ్ సింగ్, రాకేష్, రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.






నిరుత్సాహపడితే దైవం కూడా వ్యతిరేకిస్తుంది. – ఆచార్య చాణక్యుడు

వర్తమానం

# గల్ఫ్‌లో భారత కార్మికులను ఆదుకుంటాం

గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారత కార్మికుల కోసం కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖతో కలసి పనిచేయడానికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ అంగీకరించారు. జూలై 21న కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ సుష్మా స్వరాజ్‌ని కలిసి గల్ఫ్‌లో చిక్కుకున్న భారత కార్మికుల వెతలు వివరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఉన్నారని, వీరందరూ చిన్న చిన్న సంస్థల ద్వారా అనేక మోసాలకు గురై గల్ఫ్ దేశాల్లో అష్టకష్టాలు అనుభవిస్తున్నారని దత్తాత్రేయ వివరించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దళారులు నకిలీ వీసాలు, పాస్‌పోర్టులు సృష్టించి వేలాది కార్మికులను గల్ఫ్ దేశాలు పంపారని అక్కడ వారందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారని సుష్మా స్వరాజ్‌కి వివరించారు. కొన్ని సందర్భాల్లో అక్కడ కార్మికులు మృతి చెందితే వారి మృతదేహాలను భారత్‌కు రప్పించడానికి సంవత్సర కాలం పడుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కొన్ని దేశాలతో మనకు ఇంటర్నేషనల్ మైగ్రెంట్ లేబర్ విషయంలో ఒప్పందాలు ఉన్నా సరిగ్గా అమలు కావడం లేదని విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు దత్తాత్రేయ. ఈ విషయంపై కేంద్ర కార్మిక, విదేశీ వ్యవహారల మంత్రిత్వ శాఖలు సంయుక్త సమావేశాలు నిర్వహించి ఓ కార్యాచరణను రూపొందిస్తే బాగుంటుందన్న దత్తాత్రేయ సూచనకు సుష్మా స్వరాజ్ సానుకూలంగా స్పందించారు. రెండు శాఖల కార్యదర్శులు నివేదికలు రూపొందించి సమావేశమైతే ఆ తరువాత మంత్రులిద్దరూ సమావేశమై గల్ఫ్ బాధిత కార్మికుల భద్రతకు, సంక్షేమానికి ఓ పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని దత్తాత్రేయ చెప్పారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత కార్మికుల పని పరిస్థితులు, జీతాలు, వేతనాలు అన్నింటిపైనా ఈ సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారానికి మార్గం కనుగొనే అవకాశం ఉంటుందని దత్తాత్రేయ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే హైదరాబాద్‌లో కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఉన్నప్పటికీ ఇటువంటి పరిస్థితులు ఎందుకు ఉత్పన్నమవుతున్నాయో దర్యాప్తు చేయిస్తామని విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ హామీ ఇచ్చినట్లు దత్తాత్రేయ చెప్పారు. హైదరాబాద్ కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చెయ్యడంతో పాటు పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని కూడా విస్తరించి కార్యకలాపాలు ఎక్కువయ్యేలా చర్యలు తీసుకోవాలని సుష్మా స్వరాజ్‌ని కోరినట్లు, దానికి ఆమె సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ తెలియజేశారు.

**–జనసందేశ్ ప్రతినిధి**




జూలై 29న బిజెపి తెలంగాణ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సరోజ్ పాండే, రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయ తదితరులు పాల్గొన్నారు.



జూలై 27న కనీస వేతనాల కమిటీ ఛైర్మన్ ఆవుల గోవర్ధన్, కుమ్రం భీం బిజెపి జిల్లా అధ్యక్షుడు జె.బి.ఫౌడేల్ బెల్లంపల్లిలో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు.

వర్తమానం

# ఈశాన్యానికి భారీ సాయం

వరదలకు అతలాకుతలం అవుతోన్న ఈశాన్య రాష్ట్రాలలో సహాయం, పునరావాసం, పునర్ నిర్మాణం, వరదల అనంతర ప్రభావాన్ని తగ్గించే చర్యలను చేపట్టడం కోసం రూ. 2,000 కోట్లకుపైగా ప్యాకేజీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయా రాష్ట్రాలలో వరదల పరిస్థితి, సహాయక చర్యలను సమీక్షించేందుకు ప్రధాన మంత్రి వరుసగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశాల్లో ఈ ప్రకటన వెలువడింది.

ప్రధాన మంత్రి అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, నాగాలాండ్‌లలో తలెత్తిన పరిస్థితిపై వేరువేరుగా సమగ్ర సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులు, సీనియర్ అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. సమావేశానికి స్వయంగా హాజరవడం కుదరని మిజోరమ్ ముఖ్యమంత్రి ఒక విజ్ఞాపన పత్రాన్ని పంపించారు. ఒక్క మౌలిక రంగానికే కేంద్ర ప్రభుత్వం రూ. 1,200 కోట్లకు పైగా నిధులను ఇవ్వనుంది. ఈ నిధులను రహదారులు, హైవేలు, వంతెనలు ఇంకా ఇతరత్రా దెబ్బతిన్న నిర్మాణాల మరమ్మతులకు, నిర్వహణకు, పటిష్టపర్చేందుకు వినియోగించనున్నారు.

బ్రహ్మపుత్ర నదిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రూ. 400 కోట్లు అందిస్తారు. తద్వారా వరదల నియంత్రణకు తోడ్పాటు అందగలదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, ఎస్‌డిఆర్ఎఫ్‌కు కేంద్ర వాటాగా రూ. 600 కోట్లను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో రూ. 345 కోట్లను ఇప్పటికే విడుదల చేశారు. మిగిలిన మొత్తాన్ని ఆ రాష్ట్రాలలో సహాయక, పునరావాస కార్య కలాపాలకు ఉపయోగపడడానికి వెంటనే విడుదల చేయనున్నారు. ఈ ప్రాంతంలో వరదలను నివారించే దీర్ఘకాలిక పరిష్కారాలను నిర్ణీత గడువులో అన్వేషించేందుకు సంయుక్తంగా చేపట్టవలసిన చర్యలపై అధ్యయనం చేసేందుకు రూ. 100 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది.

భారతదేశ భూభాగంలో 8 శాతం ఈశాన్య ప్రాంతానిదే. అలాగే, దేశంలోని జల వనరులలో మూడింట ఒక వంతు జల వనరులు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన విస్తారమైన జల వనరులను సరైన రీతిలో నిర్వహించేందుకు ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఈ సంఘంలో భారత ప్రభుత్వం, ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖలకు ప్రాతినిధ్యం ఉంటుంది.

వరదలలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుండి రూ. 2 లక్షల వంతున పరిహారం మంజూరు చేశారు. ఈ సొమ్మును మృతుల రక్త సంబంధీకులకు చెల్లిస్తారు. వరదల బారిన పడి తీవ్రంగా గాయాలైన వారికి ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



జూలై 20న నల్గొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన రైతు దీక్ష సభలో బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొంకణాల శ్రీధర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ కొండయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరామోజు షణ్ముఖ, వీరెల్లి చంద్రశేఖర్, పాతూరి కరుణ, పల్లెబోయిన శ్యాంసుందర్, ఓరుగంటి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతపాక సాంబయ్య, బంటు సైదులు, యానాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు

ఆగస్టు 2న బిజెపి ప్రవాస్ భారతి సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.






కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. - షేక్స్పియర్

Declaration No. K1852/SB/81/2005

R.N.I. No.52751/91, Postal Regd. No.H-HD-GPO/018/2015-2017
Date of Publication : 03-08-2017
Date of Posting : 08-08-2017

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు



కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్



కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ



బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మహాప్రస్థానం
డాక్యుమెంటరీ విడుదల



వేదిక వద్ద పండిట్ దీన్‌దయాళ్ ఫోటో ఎగ్జిబిషన్



బిజెపి పాటల సీడీ ఆవిష్కరణ



బిజెపిలో చేరిన
భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి తదితరులు



జన్మదినం సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యుడు
పేరాల శేఖర్ రావుకు అభినందనలు

Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU** on behalf of Bharateeya Janata Party and Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan, opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.